దేశ సమగ్రతకోసం ప్రాణాలర్పించిన అమరజీవి 'ముఖర్జీ'




PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

జలమండలి కార్యాలయం ముందు బోడుప్పల్ ఫెడరేషన్ 'మహాధర్నా'




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 178 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 24 జూన్ 2026

# రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని మోదీ భేటీ

- క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణపై చర్చ?



న్యూఢిల్లీ,జూన్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్): కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై జోరుగా చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మిగతా2లో...

## ఘనంగా పద్మపురస్కారాల

# ప్రదానం

- పద్మభూషణ్ అందుకున్న నటుడు మమ్ముట్టి
- పద్మశ్రీలు అందుకున్న మురళీమోహన్, రాజేంద్రప్రసాద్
- కార్యక్రమంలో ప్రధాని మోడీ తదితరుల హాజరు




# రేవంత్ కోరారు.. కేంద్రమంత్రులను కలిసాం

- ఎక్స్ వేదికగా కిషన్ రెడ్డి వెల్లడి



న్యూఢిల్లీ,జూన్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్): ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, మంగళశారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో రేవంత్ మిగతా2లో...

## హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు

# గ్రీన్ సిగ్నల్

కేంద్రమంత్రులతో సిఎం రేవంత్ చర్చలు ఫలప్రదం

ఖట్టర్ నివాసంలో కిషన్ రెడ్డితో కలసి భేటీ

మెట్రో రైలుపై చర్చల్లో కీలక పురోగతి



న్యూఢిల్లీ,జూన్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్): హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు భవిష్యత్తుకు సంబంధించి అత్యంత కీలకమైన అడుగు పడింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రులతో జరిపిన వరుస సమావేశాలు విజయవంతమయ్యాయి. మిగతా2లో...



## కేంద్రమంత్రి రామ్మోహన్‌తో

# రాష్ట్ర మంత్రుల భేటీ

- గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై తుమ్మల విజ్ఞప్తి

న్యూఢిల్లీ,జూన్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్): కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టాలని మిగతా2లో...

# కుంభకోణాల గనిగా సింగరేణి

- ప్రభుత్వ విధానాలతో సింగరేణి పూర్తిగా నిర్వీర్యం
- మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు



భద్రాద్రి కొత్తగూడెం,జూన్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిని కుంభకోణాల గనిగా మార్చిందని మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో సింగరేణి పూర్తిగా నిర్వీర్యం అవుతోందని, 137 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా ప్రస్తుతం అత్యంత దయనీయ స్థితికి చేరుకుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగూడెం పర్యటనలో ఆయన మాట్లాడుతూ.. ఓపెన్ కాస్ట్ ఓబీ టెండర్లలో భారీ ఎత్తున అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని మండిపడ్డారు. సైట్ విజిట్ పేరుతో సరికొత్త నాటకానికి తెరలేపి, ఓబీ టెండర్లలో పెద్ద ఎత్తున గోల్‌మాల్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంలో ఉప ముఖ్యమంత్రి, భట్టి విక్రమార్క పాత్ర అత్యంత కీలకమని, ఆయన పర్యవేక్షణలోనే ఈ అక్రమాలు సాగాయని హరీశ్ రావు స్పష్టం చేశారు. మిగతా2లో...



## పాఠశాలలు, అంగన్‌వాడీలకు

# నిరంతర నీటి సరఫరా

స్వచ్ఛ భారత్ మిషలన్ లక్ష్యాలపై కీలక సూచనలు

అధికారలుతో అభివృద్ధి, సంక్షేమాలపై మంత్రి సీతక్క సమీక్ష

హైదరాబాద్,జూన్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్): పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నిరంతర నీటి సరఫరా ఉండాలని మంత్రి సీతక్క అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాల సాధనపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలంలో తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ అధికారులకు సూచనలు చేశారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలపై మంత్రి సీతక్క రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మంగళవారం జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీఆర్‌డీఓలు, డీపీఓలతో మంత్రి సమావేశమయ్యారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పురోగతిపై మిగతా2లో...

## ఆయిల్ పామ్ రైతులకు

# రక్షణ కల్పించాలి..

● దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలి ● తెలంగాణకు తక్షణమే డీఏపీ, యూరియా సరఫరా చేయాలి ● పప్పధాన్యాలు, నూనెగింజల కొనుగోలుపై 25 శాతం పరిమితి ఎత్తివేయాలి ● మొక్కజొన్న, జొన్నలను కేంద్రం ఎంఎస్‌పిపై కొనుగోలు చేయాలి ● తెలంగాణ రైతాంగ ప్రయోజనాల కోసం కేంద్రానికి వినతులు ● కేంద్ర మంత్రులను కలిసిన తుమ్మల, ఉత్తమ్



న్యూఢిల్లీ,జూన్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని బృందం మంగళవారం న్యూఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, రైతాంగ ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, మిగతా2లో...

# నీట్‌తో విద్యార్థుల్లో గందరగోళం



● హిందీ మనకు అసవరం లేదు ● తమిళం, ఇంగ్లీస్ సరిపోతుంది ● కుటుంబ పార్టీలకు తాము వ్యతిరేకం ● ప్రజలంతా తమ కుటుంబమనే భావనతో పాలన ● ఎన్నో అవమానాలు ఎదుర్కొని ఇక్కడికి వచ్చా ● ప్రజల సంపూర్ణ మద్దతుతో అధికారం చేపట్టాం ● కరూర్ తొక్కిసలాట ఘటన మరచిపోలేని విషాదం ● అసెంబ్లీలో సిఎం విజయ్ కీలక ప్రసంగం

చెన్నై,జూన్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్): తమిళనాడు విద్యార్థు ల్లో నీట్ అసమానతల్ని సృష్టిస్తోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ అన్నారు. అసమానతలకు కారణమైన నీట్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమిళనాడు అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ మంగళవారం కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా హిందీ మిగతా2లో...

# కాంగ్రెస్ అవినీతిపై పోరాటం చేస్తాం

● హైదరాబాద్ మెట్రో ట్రైన్ పేరుతో ● రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి డ్రామాలు? ● రూ.30 వేల కోట్ల మెట్రో రైల్ ● ఆస్తులపై సీఎం కన్ను : కేటీఆర్



మియాపూర్,జూన్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిపై పోరాటం చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి పార్టీ నియోజవకర్గ స్థాయి కార్యకర్తల సమావేశం మియాపూర్‌లోని నేరన్ గార్డెన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రో రైల్ పేరుతో రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.30 వేల కోట్ల మెట్రో రైల్ ఆస్తులపై రేవంత్ రెడ్డి కన్ను పడిందన్నారు. బీఆర్ఎస్ తరపున కార్యకర్తల మిగతా2లో...

# హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, అలాగే ఫేజ్-2 విస్తరణ పనుల్లో ఉన్న అన్ని ప్రధాన ఆటంకాలు ఈ చర్చలతో తొలగిపోయాయి. మంగళవారం ఉదయం కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు ఉన్నతస్థాయి సంయుక్త సమావేశం జరిగింది. ఈ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్రమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్, జి. కిషన్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. మెట్రో విస్తరణ, నిధుల సమీకరణ, కేంద్ర-రాష్ట్ర ఉమ్మడి భాగస్వామ్యంపై ఈ సమావేశంలో అందరూ ఒక ఏకాభిప్రాయానికి వచ్చారు. మెట్రో ప్రాజెక్టును ఆర్థికంగా, సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిష్ఠాత్మక ఆర్థిక సలహా సంస్థను కన్సల్టెంట్‌గా ఎంపిక చేశారు. ఈ సంస్థ ప్రధాన అంశాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇవ్వనుంది. ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకుంటున్న నేపథ్యంలో.. దానికి సంబంధించిన అప్పులు, ఈక్విటీ విలువ రుణ సేకరణపై రోడ్ మ్యాప్ తయారు చేస్తుంది. ఫేజ్-2 కింద ప్రతిపాదించిన కారిడార్ల నిర్మాణ వ్యయం ఎంత అవుతుంది? నిధుల కోసం ఏయే అంతర్జాతీయ రుణ సంస్థలను ఎంచుకోవాలి? అనే అంశాలపై నివేదిక అందిస్తుంది. ఈ కన్సల్టెంట్ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా తదుపరి అడుగులు వేస్తాయి. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేక సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో కేందప్రభుత్వ ప్రతినిధితో పాటు తెలంగాణ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి సమన్వయ సభ్యులుగా వ్యవహరిస్తారు. కేంద్ర నిబంధనల ప్రకారం డీపీఆర్ లలో మార్పులు చేస్తూ, పనుల అనుమతుల పక్రియను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ పరిణామంతో హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణకు కేంద్ర ఆమోదం లభించడం సులభతరం కానుంది. ఇది హైదరాబాద్ నగర ట్రాఫిక్ కష్టాలను తీర్చడమే కాక, భవిష్యత్తు ప్రజా రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిలవనుంది. కేంద్రమంత్రి ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో.. హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. మెట్రో ప్రాజెక్టుకు అప్పులు, రెండో ఫేజ్‌కు అనుమతులు, నిధులు కావాలని సీఎం రేవంత్ కోరినట్లు సమాచారం. సమావేశంలో సీఎస్ రామకృష్ణ రావు, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు. రెండు రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోనే ఉన్నారు. కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలతో బిజీబిజీగా గడుపు తున్నారు. ఇప్పటికే ఢిల్లీలో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు.. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కలిశారు. అలాగే, తెలంగాణ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు ఉదయం ఢిల్లీకి చేరుకున్నారు. మధ్యాహ్నం 1 గంటకు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద జోషిని ఇరువురు మంత్రులు కలవనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని కోరనున్నారు. అనంతరం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో సమావేశమై.. యూరియా సరఫరా పెంచాలని మంత్రులు ఉత్తమ్ కుమార్, తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేయనున్నారు.

# కుంభకోణాల గనిగా సింగరేణి

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం సింగరేణిలో సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైపోవడంపై తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతోందని హరీశ్ రావు పేర్కొన్నారు. అంత పెద్ద మొత్తంలో మాయమైన బొగ్గు ఎక్కడ ఉందో యాజమాన్యం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దాదాపు రూ.1600 కోట్ల విలువైన బొగ్గును మాయం చేసి, దానికి పన్నులు ఎలా చెల్లించారో లెక్కలు తేలాల్సి ఉందన్నారు.

అసలు తవ్వని బొగ్గుకు పన్నులు కట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని, ఏ ప్రాతిపదికన డీఎంఎఫ్‌టీ నిధులు కేటాయించారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఒకప్పుడు లాభాల బాటలో పయనిస్తూ, కార్మికులకు అండగా నిలిచిన సింగరేణిని.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణాల గనిగా మార్చేసిందని హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. ఈ అక్రమాల వెనుక అధికార పక్షానికి చెందిన పెద్దల హస్తం ఉందన్న ఆయన.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బంధువులకు చెందిన శోధ కంపెనీ సైతం ఈ ఓబీ అక్రమాల్లో భాగస్వామిగా మారిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. సంస్థను లాభాల బాటలో నడిపించాల్సింది పోయి, సింగరేణి థర్మల్ ప్రాజెక్టును కూడా క్రమంగా నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పాఠశాలలు, అంగన్‌వాడీలకు నిరంతర నీటి సరఫరా

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాల వారీగా సమీక్ష చేశారు. ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు పనిదినాల కల్పన, పెండింగ్ మెటీరియల్ బిల్లుల చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించారు. అంగన్‌వాడీ భవనాలు, మహిళా శక్తి భవనాలు, జీపీ కార్యాలయాల నిర్మాణాలపై సమీక్షించారు. జల సంరక్షణ పనులు, చెక్‌డ్యాంల నిర్మాణాలపై అధికారులతో మంత్రి చర్చలు జరిపారు. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన(పీఎమ్‌కేఎస్‌వై) పనుల అమలుపై మంత్రి సమీక్ష జరిపారు. గ్రామపంచాయతీల పనితీరు, గ్రామ కార్యదర్శుల హాజరుపై సీతక్క ఆరా తీశారు. పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్ల పురోగతిపై చర్చించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులపైనా సమీక్ష చేశారు. గ్రామీణ రహదారుల నిర్మాణం, మరమ్మతులపై పీఆర్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష చేశారు. మహిళా సంఘాల బలోపేతం, బ్యాంక్ లింకేజీల పెంపుపై సెర్ప్‌తో చర్చించారు. మహిళల జీవనోపాధి అవకాశాల విస్తరణకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా ప్రతి పథకం అమలు కావాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ తెలంగాణ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అలాగే, గ్రామ స్థాయిలో భూగర్భ జలాలు పెంచే విధంగా 'జలసిరి' పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు.

# ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

- ఉచిత బీమా పథకం ప్రారంభించనున్న సీఎం



**హైదరాబాద్,జూన్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఉచిత జీవిత బీమా పథకాన్ని గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ పథకం కింద అర్హులైన ఉద్యోగులు, పెన్షనర్లకు రూ.1.20 కోట్ల వరకు ఉచిత జీవిత బీమా రక్షణ కల్పించనున్నారు. సహజ మరణం, ప్రమాద మరణం వంటి సందర్భాల్లో బీమా ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు బ్యాంకులతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

# ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించాలి..

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ, రైతుల ప్రయోజనాల పరిరక్షణ, దేశీయ వంటనూనెల ఉత్పత్తి పెంపుపై విస్తృతంగా చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్-ఆయిల్ పామ్ లక్ష్యాలను అత్యంత సమర్థవంతంగా అమలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి తుమ్మల వివరించారు.

రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరించగా, 70 వేల మందికిపైగా రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. రాబోయే మూడేళ్లలో ఈ విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. భారత్ ప్రస్తుతం వంటనూనెల అవసరాల్లో దాదాపు 60 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోందని, ఈ పరిస్థితిని మార్చేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ఔఓఇక్ష-క్షఖ కార్యక్రమం దేశ ఆర్థిక వ్యవస్థకు, రైతాంగానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. అయితే ఇటీవల క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 44 శాతం నుంచి 16 శాతానికి తగ్గించడం వల్ల దేశీయ ఆయిల్ పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దిగుమతి సుంకం తగ్గింపుతో విదేశాల నుంచి చౌక ధరలకు పామాయిల్ దిగుమతులు పెరిగి దేశీయ మార్కెట్లో ధరలు పడిపోతున్నాయని, దీనివల్ల ఆయిల్ పామ్ రైతులు ఉత్పత్తి చేస్తున్న ఫ్రెష్ ఫ్రూట్ బంచ్‌లకు గిట్టుబాటు ధర లభించడం లేదని వివరించారు. దీర్ఘకాలిక పంట అయిన ఆయిల్ పామ్ సాగుకు రైతులు భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో ధరల అనిశ్చితి రైతుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. దిగుమతి సుంకాన్ని తిరిగి 44 శాతానికి పెంచడం ద్వారా దేశీయ ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన ఆత్మనిర్భర్ భారత్, ఎడిబుల్ ఆయిల్ స్వయం సమృద్ధి లక్ష్యాలు కూడా సాధ్యమవుతాయని మంత్రులు పేర్కొన్నారు. అలాగే ఆయిల్ పామ్ రైతులకు కనీస గ్యారంటీ ధర విధానాన్ని అమలు చేసే అంశాన్ని కూడా కేంద్రం పరిశీలించాలని కోరారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఆయిల్ పామ్ రైతుల భవిష్యత్తు దృష్ట్యా దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించి రైతులకు భరోసా కల్పించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని మంత్రులు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణ రైతాంగానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు.

# కేంద్రమంత్రి రామ్మోహన్‌తో రాష్ట్ర మంత్రుల భేటీ

(మొదటి పేజీ తరువాయి)



కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసిన వెంటనే స్పందించి.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరఫున ఫీజిబులిటీ సర్వే చేసినందుకు రామ్మోహన్ నాయుడికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఫీజిబులిటీ సర్వేలో ప్రతిపాదిత స్థలం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతిపాదన చేసినట్లు చెప్పారు. అక్కడ త్వరగా ఫీజిబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రికి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని మోదీ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రపతి భవన్‌లో కలుసుకున్నారు. ఈ భేటీకి సంబంధించిన చిత్రాలను రాష్ట్రపతి కార్యాలయం ఎక్స్ వేదికగా పంచుకుంది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగవచ్చన్న ఊహాగానాలు దేశ రాజధానిలో ఊపందుకున్న వేళ ఈ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది.కాగా, మంగళవారం ఉదయం కేరళకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు జార్జి కురియన్ కేంద్ర మంత్రివర్గానికి రాజీనామా చేశారు. ఆయన రాజ్యసభ పదవీకాలం ముగిసిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. 65 ఏండ్ల కురియన్ కేంద్ర మైనారిటీ వ్యవహారాలు, మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ శాఖల సహాయ మంత్రిగా ఉన్నారు. ఆయన రాజీనామాను రాష్ట్రపతి ముర్ము ఆమోదించారు. జూన్ 21న రాజ్యసభ సభ్యత్వ పదవీకాలం పూర్తయిన కురియన్‌ను తిరిగి రాజ్యసభకు నామినేట్ చేయకూడదని బీజేపీ నిర్ణయించింది.

# ఘనంగా పద్మపురస్కారాల ప్రదానం

**న్యూఢిల్లీ,జూన్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రపతి భవన్‌లో రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 65 మంది ప్రముఖులకు పద్మ అవార్డులు అందజేశారు. ఈ విడతలో మొత్తం 2 పద్మ విభూషణ్, 7 పద్మభూషణ్, 56 పద్మశ్రీ పురస్కారాలు ప్రదానం చేశారు. సినీ, సాహిత్య, వైద్య, క్రీడా తదితర రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులు ఈ గౌరవాలను అందుకున్నారు. మలయాళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ పురస్కారం లభించింది. అలాగే ప్రముఖ వైద్య నిపుణులు నోరి దత్తాత్రేయుడుకు కూడా పద్మభూషణ్ అవార్డు ప్రదానం చేశారు. తెలుగు సినీ రంగానికి చెందిన ప్రముఖ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌తో పాటు నటుడు ఆర్. మాధవన్‌కు పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. క్రికెటర్ రోహిత్ శర్మకు కూడా పద్మశ్రీ అవార్డును రాష్ట్రపతి అందజేశారు. ప్రఖ్యాత మలయాళ పాత్రికేయుడు పి. నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్ పద్మవిభూషణ్ అందుకోగా.. సినీ రంగ ప్రముఖులు మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తో పాటు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి నేడు పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నవారిలో సినీ నటులు మాగంటి మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్ ఉన్నారు. అలాగే, వీరితో పాటు సినీనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్ శర్మ, పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు. దేశంలోని పలు రంగాల్లో విశేష సేవలంది ంచిన వారికి భారత గణతంత్ర దినోత్సవం వేళ కేంద్రం మొత్తం 131 మందికి పద్మ పురస్కారాలకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తొలి విడతలో 66 మందికి అందజేయగా.. మిగతా వారికి మంగళవారం ప్రదానం చేశారు. దేశ అభివృద్ధికి, తమ తమ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులను గౌరవించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పద్మ పురస్కారాలను ప్రదానం చేస్తోంది. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్‌తో విద్యార్థుల్లో గందరగోళం

(మొదటి పేజీ తరువాయి)

వివాదం, నీట్, కరూర్ తొక్కిసలాట ఘటన వంటి పలు అంశాలను ప్రస్తావించిన విజయ్ విమర్శకులకు గట్టిగా బదులిచ్చారు. ఈ మేరకు అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందీ భాషనూ వ్యతిరేకించారు. తమిళం, ఇంగ్లీష్‌లతో కూడిన ద్విభాషా విధానానికే తాము కట్టుబడి ఉంటామన్నారు. నీట్ వల్ల సామాజిక అసమానతలు పెరుగు తున్నాయని సీఎం విజయ్ చెప్పుకొచ్చారు. విద్యార్థులపై తీవ్ర మానసిక ఒత్తిడి తెస్తున్న ఈ పరీక్షను రద్దుచేసి, ఇంటర్ మార్కుల ఆధారంగా వైద్య సీట్లను కేటాయించాలని తమిళనాడు చాలా కాలంగా కోరుతోందని ఆయన గుర్తుచేశారు. హిందీ భాషపైనా స్పందిస్తూ.. తమిళం రాష్ట్ర భాషగా, ఇంగ్లీష్ అంతర్జాతీయ భాషగా సరిపోతాయని తన వైఖరిని స్పష్టం చేశారు. మూడో భాషను బలవంతంగా రుద్దాల్సిన అవసరం లేదని, రెండు భాషల విధానమే కొనసాగుతుందని తేల్చి చెప్పారు. తమ పార్టీని విమర్శించే వారికి ఈ సందర్భంగా గట్టిగా సమాధాన మిచ్చారు సీఎం విజయ్. ప్రజల మద్దతుతోనే తమిళగ వెత్రి కళగం(టీవీకే) అధికారంలోకి వచ్చిందన్న ఆయన.. దీని వెనుక ఎన్నో కుట్రలు, సవాళ్లను ఎదుర్కొన్నామన్నారు. 'జనం గుండెల్లో స్థానం సంపాదించడం అంత సులువు కాదు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే ఇక్కడకు వచ్చాం. అయినప్పటికీ కొందరు 'నటుడి పార్టీ' అనే విమర్శలు గుప్పిస్తున్నారు. వాటన్నింటినీ మేం పట్టించుకోం. మా రాజకీయాలు పారదర్శకంగా ఉంటాయని విజయ్ చెప్పుకొచ్చారు. అలాగే కుటుంబ రాజకీయాలపై ఆయన మాట్లాడుతూ.. 'మా రాజకీయాలు ఒక్క కుటుంబం కోసమే కాదు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం మాదే. అదే మా పాలన.. అదే మా లక్ష్యం' అని స్పష్టం చేశారు. ఎన్నో సవాళ్లను దాటి తాము అధికారంలోకి వచ్చామని, నటుడి పార్టీ అని తమను ఎంతోమంది ఎగతాళి చేశారని గుర్తుచేసుకున్నారు.

మాకు ఈ అధికారం అంత సులువుగా వచ్చింది కాదు. తమిళనాడు ప్రజల హృదయాలను గెలుచుకునేందుకు నేను, నా పార్టీ ఎన్నో కుట్రలు, సవాళ్ల ను అధిగమించాల్సి వచ్చింది. మాది యాక్టర్ పార్టీ అని, నేను సినిమా షూటింగ్ నుంచి నేరుగా సీఎం కుర్చీలో కూర్చున్నానని చాలా మంది గేలి చేశారు. అలాంటి విమర్శలు నేను పట్టించుకోను. సాధారణంగా చాలా మంది రాజకీయ పార్టీ పెట్టి ప్రజల్లోకి వెళ్తారు. కానీ, నేను ప్రజల్లోకి వెళ్లిన తర్వాత పార్టీ పెట్టి ఎన్నికల్లో పోటీ చేశా. నాపై నమ్మకం ఉంచి ప్రజలు గెలిపించారని విజయ్ అన్నారు.

# కాంగ్రెస్ అవినీతిపై పోరాటం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కష్టంతో గెలిచిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తన స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌లోకి మారారని ఆరోపించారు. ఆయననే గతంలో పదేండ్ల బీఆర్ఎస్ కాలంలో ఒక్క శేరిలింగంపల్లికి రూ.9,500 కోట్లతో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులతో ఒక ప్రగతి నివేదికను విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు.మరి ఈ రెండేండ్లలో ఎన్ని డబ్బులు నియోజకవర్గానికి తెచ్చారో గాంధీ చెప్పాలని డిమాండ్ చేశారు. ?అబద్ధపు హామీలతో రేవంత్ రెడ్డి గద్దెనెక్కాడని ఆరోపించారు. తులం బంగారం, మహిళలకు రూ.2500 ఇవన్నీ ఎక్కడా అని ప్రశ్నించారు. కేసీఆర్ మళ్ళీ ఎప్పుడు అధికారంలోకి వస్తారా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ హైడ్రా పేరుతో అరచకాలు సృష్టిస్తోందన్నారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ పైన కార్యకర్తలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, వివేక్, జగదీష్ రెడ్డి, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు, సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, శేరిలింగంపల్లి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రేవంత్ కోరారు.. కేంద్రమంత్రులను కలిసాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశమయ్యారు. ప్రధానంగా హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 విస్తరణపైనే చర్చ జరిగింది. రేవంత్‌తో కలిసి కేంద్ర మంత్రులను కలవడంపై కిషన్ రెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు.'కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండుసార్లు నాకు లేఖ రాశారు. 22వ తేదీన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, 23వ తేదీన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయించాను. మెట్రో రైల్ విస్తరణపై సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయి. తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్ మంత్రిగా ఉన్న నేను రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం ఎల్లవేళలా పనిచేస్తా' అని ఎక్స్‌లో కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడికి కఠిన శిక్ష పడాలి

### ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి: ఆకుల గాంధీ





**ఖమ్మం, ప్రతినిధి జూన్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** అభం శుభం తెలియని మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడి, హత్యాయత్నానికి ఒడిగట్టిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం రాపర్తినగర్‌లో ఇటీవల 12 ఏళ్ల బాలికపై జరిగిన ఘటనను నిరసిస్తూ మున్నూరుకాపు, రజక సంఘాలు, పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఖమ్మం బస్ డిపో జెండాల సెంటర్ నుంచి ఆర్ అండ్ బి అతిథి గృహం వరకు సాగిన ర్యాలీలో నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆకుల గాంధీ మాట్లాడుతూ.. చిన్నారిపై అత్యంత దారుణానికి పాల్పడిన నిందితుడికి ఎలాంటి అవకాశం లేకుండా చట్టపరంగా కఠిన శిక్ష విధించాలని కోరారు. కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారించి త్వరితగతిన న్యాయం చేయాలని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితుడికి పడే శిక్ష సమాజానికి గట్టి హెచ్చరికగా ఉండాలన్నారు. బాధిత బాలికకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని, కుటుంబానికి రూ. కోటి నష్టపరిహారం అందించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. బాలిక భవిష్యత్‌కు జీవితాంతం ప్రభుత్వం అండగా ఉండాలని ఆకుల గాంధీ కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం నాయకులు పగడాల నరేందర్, గుండ్లపల్లి శేషగిరిరావు, దాసరి మధు, బీరెడ్డి రమేష్, తాళ్లూరి సోమయ్య, టీచర్ ఉపేందర్ రావు, వనం లక్ష్మీనర్సయ్య, ఆకుల సురేష్, తీగల రాము, హోటల్ వెంకన్న, పెళ్లూరి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ సమగ్రతకోసం ప్రాణాలర్పించిన అమరజీవి 'ముఖర్జీ'

- బిజెపి పాలేరు ఇంచార్జి నున్నా రవికుమార్ భావోద్వేగ నివాళి!
- అఖండ భారత స్వప్న సాకారమే ఆ మహనీయునికి మనం ఇచ్చే నిజమైన అంజలి
- కాశ్మీర్ విలీనానికై ప్రాణాలర్పించిన మహనీయుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ
- ఒకే దేశం.. ఒకే జెండా.. ఒకే రాజ్యాంగం ఆయన ఆశయం
- ఘనంగా 'బలిదాన్ దివస్'





**ఖమ్మం ప్రతినిధి, జూన్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** స్వాతంత్ర్యానంతరం దేశ సమగ్రత కోసం, అఖండ భారత నిర్మాణ సాధనకోసం తన ప్రాణాలనే పణంగా పెట్టిన మహోన్నత దేశభక్తుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని బిజెపి పాలేరు ఇంచార్జి నున్నా రవికుమార్ అన్నారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అమరత్వానికి (బలిదాన్ దివస్) పాలేరు గడ్డపై నివాళులర్పిస్తూ దేశభక్తిని చాటుకున్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అధ్యక్షతన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాన్ని అత్యంత భావోద్వేగభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాలేరు నియోజకవర్గ ఇంచార్జి నున్నా రవికుమార్.. ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి, చేతులు జోడించి హృదయపూర్వక నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... "ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు ఉండకూడదు" అని కాశ్మీర్ పూర్తి విలీనంకోసం పోరాడి ప్రాణాలర్పించిన ముఖర్జీ త్యాగం అనన్యసామాన్యమైనదన్నారు. ముఖర్జీ కన్న కలలను, వారి ఆశయాలను నేడు గౌరవ ప్రధాని నరేంద్ర మోడీ నెరవేర్చారని కొనియాడారు. ఆర్టికల్ 370 రద్దుతో కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగంగా మారిందని, ఇది ముఖర్జీ ఆత్మకు నిజమైన శాంతిని చేకూర్చిందని అన్నారు. శ్యామ ప్రసాద్ ముఖర్జీ, పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చూపిన ధర్మ మార్గంలోనే నేడు దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ విస్తరించిందని, రాబోయే రోజుల్లో తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అఖండ భారత్ నిర్మాణ దిశగా ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా దేశ సమగ్రతకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ పవిత్రమైన రోజును పురస్కరించుకుని, ప్రకృతిని రక్షించడం దేశాన్ని రక్షించడంతో సమానమనే భావనతో స్థానిక పోలింగ్ బూత్ ఆవరణలో నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటారు. భూమాతకు పచ్చని హారం తొడుగుతూ ముఖర్జీ స్మృతిని పదిలం చేసుకున్నారు. ఈ మహత్తర కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొవనసి దుర్గారావు, షరీఫుద్దీన్, సూరేపల్లి జ్ఞానరత్నం, మల్లబోయిన గోవిందరావు, పురాణం దివాకర్, కట్ట అప్పారావు, పిట్టల సూరిబాబు, మూడు శీను, చెరుకుపల్లి వెంకట్, మురళి, వీరబాబులతో పాటు మండల పార్టీ నాయకులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, కార్యకర్తలు, ముఖర్జీ అభిమానులు దేశభక్తి స్ఫూర్తితో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జలమండలి కార్యాలయం ముందు బోడుప్పల్ ఫెడరేషన్ 'మహాధర్నా'

- ద్వారకానగర్ కాలనీ ఫేస్-2 ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో ర్యాలీ
- తాగునీరు లేక అల్లాడుతున్న బోడుప్పల్ ప్రజలు
- మంచినీటి సమస్యను పరిష్కరించకపోతే జలమండలిని దిగ్బంధిస్తాం
- బోడుప్పల్ ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ రాపోలు రాములు








**హైదరాబాద్ జూన్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో మంచినీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారు. మండుటెండలకు బోరుబావులు ఎండిపోవడం, మున్సిపల్ వాటర్ సరిగా రాకపోవడంతో గుక్కడు నీళ్ల కోసం ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బోడుప్పల్ ప్రజల కష్టా,నష్టాలలో నేనున్నానంటూ మంచినీటి సమస్యలు పరిష్కరించేందుకు బోడుప్పల్ ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ రాపోలు రాములు ఆధ్వర్యంలో చెంగిచెర్ల డివిజన్ పరిధిలోని ద్వారకా నగర్ కాలనీ పేస్-2 అసోసియేషన్ సభ్యుల విజ్ఞప్తి మేరకు బోడుప్పల్ ఫెడరేషన్, ద్వారకా నగర్ కాలనీ అసోసియేషన్ సంయుక్తంగా ద్వారకా నగర్ హనుమాన్ టెంపుల్ నుండి చెంగిచెర్ల లోని జలమండలి కార్యాలయం వరకు కాలనీవాసులు కాలి బిందెలతో నిరసన ర్యాలీ నిర్వహిస్తూ జలమండలి కార్యాలయం ముందు బైఠాయించి మహా ధర్నా నిర్వహించారు. దినం విడిచి దినం సరిపడా మంచినీరు అధిక ప్రెజర్ తో వదలాలని, జలమండలి అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ రాపోలు రాములు మాట్లాడుతూ ప్రజలకు మంచినీరే ప్రాణాధారమని, అలాంటి మంచినీరు లేక గత కొంతకాలంగా బోడుప్పల్ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని, తక్షణమే అధికారులు స్పందించి దినం క్రమం తప్పకుండా మంచినీరు అందించాలని, లేనిపక్షంలో జలమండలి కార్యాలయం దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సానుకూలంగా స్పందించిన జలమండలి అధికారులు పైపు లీకేజీల కారణంగా నేటి సరఫరా ఆలస్యమవుతుందని, 3, 4 రోజులకు ఒకసారి ఒక గంట సేపు తప్పకుండా మంచినీరు అందిస్తామని స్పష్టమైన హామీ ఇస్తూ, అక్రమ మోటార్లను, అక్రమ నల్ల కలెక్షన్లను తొలగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ వైస్ చైర్మన్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, అధ్యక్షుడు అబ్రహం లింకన్, ప్రధాన కార్యదర్శి గడ్డం యాదగిరి, కోశాధికారి బజ్జూరి శ్రీనివాస్ గుప్త, రామకృష్ణారెడ్డి, రాజేష్, చిలక భాస్కర్, ఫెడరేషన్ సభ్యులు, ద్వారకా నగర్ కాలనీ ఫేస్- 2 అధ్యక్షుడుపడిగల రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్ కుమార్, జనరల్ సెక్రటరీ రాజేష్ గౌడ్, కోశాధికారి రాజేందర్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, అడ్వైజర్స్, జాయింట్ సెక్రెటరీలు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, కల్చరల్ సెక్రటరీలు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు కాలనీవాసులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కల్లూరు అభివృద్ధికి నిధుల కోసం హైదరాబాద్‌లో మున్సిపల్ చైర్మన్ ప్రయత్నాలు

- సీడీఎంఏ శ్రీదేవితో భేటీ.. మౌలిక వసతుల కల్పనపై సుదీర్ఘ చర్చ



**కల్లూరు, జూన్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ హైదరాబాద్‌లో తెలంగాణ (సీడీఎంఏ) కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శ్రీదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, పట్టణ సుందరీకరణ కార్యక్రమాలు, రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యాల మెరుగుదల తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పట్టణంలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నిధులను త్వరితగతిన మంజూరు చేయాలని చైర్మన్ ధరావత్ మోహన్ కోరారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సీడీఎంఏ శ్రీదేవి సానుకూలంగా స్పందిస్తూ, కల్లూరు మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు చైర్మన్ తెలిపారు. కల్లూరు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని మున్సిపల్ చైర్మన్ పేర్కొన్నారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి: ఎస్సై వెంకటేష్




**పెనుబల్లి, జూన్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి వినియోగం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని వియం బంజర ఎస్సై వెంకటేష్ అన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు వియం బంజర పోలీసుల ఆధ్వర్యంలో కుప్పెనకుంట్ల లోని గురుకుల పాఠశాల, కళాశాల లో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండడంతో పాటు ఇతరులను కూడా అప్ర మత్తం చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు కట్టుబడి ఉన్నారని, మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై ప్రజలు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పప రిణామాలపై విద్యార్థులు, ప్రజలకు కూడా విస్తృతంగా అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

# తమపై దాడి చేసిన ప్రశాంత్ దాసును అరెస్టు చేయాలి

**- బాధితులు అజయ్ సింగ్, మోహిత్ సింగ్**



**హైదరాబాద్, జూన్ 23(పిసి డబ్ల్యూ న్యూస్):** సాధువుల ముసుగులో దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారి నుంచి రక్షణ కల్పించాలంటూ పురాణా పూల్ ప్రాంతానికి చెందిన అజయ్ సింగ్, మోహిత్ సింగ్ లు పోలీసు ఉన్నత అధికారులను కోరారు, ఈ మేరకు మంగళవారం అఫ్జల్ గంజ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు అజయ్ సింగ్, మోహిత్ సింగ్ లు మాట్లాడుతూ.. పురానాపూల్ మూసినది పరివాహ ప్రాంతానికి, నిర్వాన్ అకాడ మట్ కి వెనకాల, ఆనుకొని ఉన్న 600 గజాల స్థలం, తమ పూర్వీకుల నుంచి గత 70 సంవత్సరాలుగా తమ కుటుంబం జివనోపాధి పొందుతుందని, తాను కూడా ఇదే స్థలంలో నివాసం ఉంటూ గణేష్ విగ్రహాలను తయారు చేస్తూ వాటిని విక్రయించి వచ్చే ఆదాయంతో జీవనోపాధి పొందుతున్నానని తెలిపారు, అయితే గత శనివారం నిర్వాహ అకాడ మట్ కు చెందిన ప్రశాంత్ దాస్ ఇతర రాష్ట్రాలకు చెందిన 15 మంది నాగసాధులతో తాను ఉంటున్న స్థలానికి మారనాయుధాలతో వచ్చి తనపై దాడి చేసి విచక్షణ రహితంగా కొట్టి, తనని బలవంతంగా రోడ్డుపై ఈడ్చుకుంటూ లాక్కొని వెళ్లి మఠంలో నిర్బంధించి తన ఒంటిపై ఉన్న గుడ్డలను కూడా తీసి తనపై పిడుగులతో లాఠీలతో విచక్షరహితంగా కొట్టారని అజయ్ సింగ్ తెలిపారు. కులుసుంపుర ఇన్స్పెక్టర్ రాములు, ఏసిపి తిరుపతయ్యలు పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి వచ్చి నిర్వాన్ అకాడ మట్ లో నిర్బంధించిన, తనను విడిపించారని తెలిపారు. వైద్య చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారని ఆయన తెలిపారు. అజయ్ సింగ్ పై ఎందుకు దాడి చేస్తున్నారని, ఆయనను ఎందుకు నిర్బంధించారని అడిగిన తన అన్నకుమారుడు మోహిత్ సింగ్ తల పైన తల్వార్ తో సాధువులు దాడి చేయడంతో తీవ్ర గాయాలు పాలవడంతో అతని కేర్ ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. సాధు ముసుగులో రౌడీలా తన ప్రాణాలు తీస్తే స్థలం తన వశం అవుతుందని ప్రశాంత్ దాస్ భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి

**రైతు వేదికల్లో విత్తన మేళాలు**

**నాణ్యమైన విత్తనాల వినియోగానికి పిలుపు**

**కల్లూరులో రైతు నేస్తం**

**సన్న వడ్ల సాగుపై అవగాహన**

**జూన్ 23 నుండి 30 వరకు విత్తన మేళాలు..**

**రైతులు సద్వినియోగం చేసుకోవాలి**

**నానో యూరియా, నానో డీఏపీతో దిగుబడులు పెరుగుతాయి**

**రైతులకు అందుబాటులో నాణ్యమైన విత్తనాలు**

**విత్తన మేళాలో రైతులకు సాగు సాంకేతికతలపై అవగాహన**



**కల్లూరు, జూన్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జూన్ 23 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రంలోని ప్రతి రైతు వేదికలో విత్తన మేళాలు నిర్వహిస్తున్నారని వ్యవసాయ శాఖ అధికారి ఎం రూప తెలిపారు. ఇందులో భాగంగా కల్లూరు మండల రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం, విత్తన మేళా నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు నకిలీ (స్పూరియస్) విత్తనాల వల్ల కలిగే నష్టాలు, వాటిని గుర్తించే విధానం, సాగుకు అనువైన సన్న వడ్ల రకాలు, నానో యూరియా, నానో డీఏపీ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. విత్తన మేళాలో సన్న వడ్ల విత్తనాలు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విత్తనాలు, నానో యూరియా, నానో డీఏపీ రైతులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యమైన విత్తనాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్, మున్సిపల్ కౌన్సిలర్లు, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి చంద్రరావు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పొట్రూ అర్జున్ రావు, టౌన్ అధ్యక్షుడు ఉస్మాన్, గ్రామ సర్పంచులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు, ఏఈఓ చంద్రుపట్ల, ఏఈఓ కల్లూరు తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు: కల్లూరు ఎస్సై హరిత




**కల్లూరు, జూన్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్)** :మాదక ద్రవ్యాలపై ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ వేముల శేఖర్ అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేసినట్లు ఎస్సై డి హరిత తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ హరిత మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు కల్లూరు పోలీసుల ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై హరిత మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండడంతో పాటు ఇతరులను కూడా అప్రమత్తం చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు కట్టుబడి ఉన్నారని, మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై ప్రజలు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పప రిణామాలపై విద్యార్థులు, ప్రజలకు కూడా విస్తృతంగా అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమాలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వేముల శేఖర్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలు

**ఆవేదన వ్యక్తం చేసిన వైద్యుల అంజన్ కుమార్**

**విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రంలోని ఎన్డీఏ సర్కార్ చెలగాటం ఆడుతోంది**

**ఎస్ఐఆర్‌పై ప్రతి బూత్‌లో ఐదుగురు కాంగ్రెస్ కార్యకర్తలకు అవగాహన ఉండాలి.**

**ప్రత్యేక సమావేశంలో పార్టీ శ్రేణులకు సూచించిన వైద్యుల అంజన్ కుమార్**



**కరీంనగర్ టౌన్ జూన్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):** ఏఐసీసీ ఆదేశాల మేరకు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు నీట్ అక్రమాలు, విద్యార్థి, యువత సమస్యలపై కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ నేడు పలువురు కాంగ్రెస్ నేతలతో కలిసి డీసీసీ కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో బీజేపీ ప్రభుత్వం చెలగాటమాడుతోంది. నీట్ యూజీ-2026 పరీక్షలో పేపర్ లీకేజీ, గ్రేస్ మార్కుల కుంభకోణం, ఒకే సెంటర్‌లో 6-7 మందికి 720కి 720 మార్కులు రావడం ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. ఎన్టీఏ పూర్తిగా విఫలమైంది. ఇది కేవలం పరీక్ష కాదు, పేద, మధ్యతరగతి విద్యార్థుల కలలను అమ్ముకునే దందా అని ధ్వజమెత్తారు.తెలంగాణ నుండి లక్షలాది మంది విద్యార్థులు నీట్ రాశారు. వారిలో చాలా మంది పగలనక రాత్రనక కష్టపడి చదివారు. కానీ పేపర్ లీకేజీ మాఫియా వల్ల మన బిడ్డలకు అన్యాయం జరిగింది. డబ్బున్న వాళ్లు సీట్లు కొనుక్కుంటుంటే, ప్రతిభ ఉన్న పేద విద్యార్థి ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చింది. దీనికి బాధ్యత ఎవరు వహిస్తారు అని ప్రశ్నించారు.నీట్-2026 పరీక్షను వెంటనే రద్దు చేసి, తిరిగి నిర్వహించాలి. పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్టింగ్ జడ్జితో సిబిఐ విచారణ జరిపించాలి. ఎన్టీఏ ని రద్దు చేసి, పరీక్షల నిర్వహణకు కొత్త పారదర్శక వ్యవస్థను తీసుకురావాలి. నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి. కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి అని డిమాండ్ చేశారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యార్థుల పక్షాన నిలబడుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నీట్ బాధిత విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తాం. మన రాష్ట్ర విద్యార్థుల ఒక్క సీటు కూడా పోనివ్వం అని భరోసా ఇచ్చారు.దేశంలో బీజేపీ, రాష్ట్రంలో 10 ఏళ్లు బీఆర్ఎస్ పాలనలో విద్యా వ్యవస్థను నాశనం చేశారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీతో లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న బీఆర్ఎస్‌కు నీట్‌పై మాట్లాడే నైతిక హక్కు లేదు. విద్యార్థుల ఉసురు ఊరికే పోదు అని బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలపై విరుచుకుపడ్డారు.కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అత్యవసర సమావేశంపత్రిక విలేకరుల సమావేశం అనంతరం కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ సభ్యులతో వైద్యులు అంజన్ కుమార్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినారు ఈ సందర్భంగా ఎస్ ఐ ఆర్ సమగ్ర ఓటర్ సవరణ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవెల్ ఏజెంట్ 2 నియామక ప్రక్రియ వేగవంతం వారి విధివిధానాలను తదితర అంశాలపై సభ్యులకు వివరించడం జరిగింది, ఎస్ ఐ ఆర్ పై 10 డివిజనులకు ఒక నాయకుడిని బాధ్యులుగా నియమించడం జరుగుతుందని వీరు ఆ డివిజన్ల లోని ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ గురించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తారని బూత్ లెవెల్ ఏజెంట్లకు సాంకేతిక మరియు ఇతర సమస్యలు ఉంటే వారికి పరిష్కార మార్గాలు చూపిస్తారని అన్నారు.ఈ సమావేశంలో కార్పొరేటర్లు గంట కళ్యాణి శ్రీనివాస్, కాంతార జగన్ రెడ్డి, ఆకుల నందిని ఉదయ్, కాంగ్రెస్ నాయకులు హాజీ, కపిల్ మాధవ్, బొమ్మ ఈశ్వర్ గౌడ్, కంకణాల అనిల్ కుమార్, వీర దేవేందర్ పటేల్, సందీప్, గడ్డం శ్రీరాములు, ఇమ్రాన్ ఘని, మాలోతు మహాలక్ష్మి, స్వప్న, మహమ్మద్ ఇమ్రాన్, పెంట శేఖర్, మహమ్మద్ వసీం, సిరిపురం మనోజ్ కుమార్, మొహమ్మద్ నయీమ్, సత్తినేని శ్రీకాంత్, రోళ్ళ సతీష్, జ్యోతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ఎండోమెంట్ సెల్ సెంట్రల్ జిల్లా కన్వీనర్ రామన్న గారి పోచాలు ప్రసాద్ నియామకం



**హైదరాబాద్, జూన్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):** బీజేపీ ఎండోమెంట్ సెల్ (ధార్మిక విభాగం) హైదరాబాద్ సెంట్రల్ జిల్లాకన్వీనర్ రామన్నగారి పోచాలు ప్రసాద్ను నియమిస్తూ రాష్ట్ర కన్వీనర్ అన్నవోజుల సూర్యప్రకాష్, రాష్ట్ర కో -కన్వీనర్ నిరంజన్ దేశాయ్ మంగళవారం అధికారిక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా బర్కతపురలోని పార్టీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రామన్నగారి పోచాలు ప్రసాద్ ను పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు, జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్రెడ్డి, తదితరులు ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం పోచాలు ప్రసాద్ మాట్లాడుతూ... పార్టీ తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో, సమర్థవంతంగా నిర్వహిస్తూ ధార్మిక రంగ అభివృద్ధి, ఆలయాల పరిరక్షణ, హిందూ ధార్మిక విలువల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. పార్టీ నేతలు తనకు అందించిన ప్రోత్సాహం, సహకారానికి పోచాలు ప్రసాద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# బీఆర్ఎస్‌కు బిగ్ షాక్

**రామడుగు సర్పంచ్, ఉపసర్పంచ్, 7గురు వార్డు సభ్యులు కాంగ్రెస్‌లో చేరిక**

**కాంగ్రెస్‌లోకి బిఆర్ఎస్ నాయకులు, రామడుగు సర్పంచ్ మహమ్మద్ మోయిూజ్**

**రేవంత్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై కాంగ్రెస్‌లో చేరాం**

**- రామడుగు సర్పంచ్ మోయిూజ్**

**రామడుగు గ్రామ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తా: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హామీ**



**రామడుగు జూన్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, బిఆర్ఎస్ నాయకులు మహమ్మద్ మోయిూజ్‌తో పాటు బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు, ఉపసర్పంచ్ పెందోట రాజ్ కుమార్, ఏడుగురు వార్డు సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నేడు కాంగ్రెస్ పార్టీలో చేరారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కరీంనగర్ పట్టణంలోని తన నివాసంలో నేడు రాముడు సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

**సంక్షేమ పథకాలకు ఆకర్షితులమయ్యాం - సర్పంచ్ మోయిూజ్**

ఈ సందర్భంగా సర్పంచ్ మహమ్మద్ మోయిూజ్, ఉప సర్పంచ్ రాజ్ కుమార్, వార్డు సభ్యులు మాట్లాడుతూ... "కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇల్లు, తెల్ల రేషన్ కార్డులతో పేదలకు సన్న బియ్యం పంపిణీ, మహాలక్ష్మి, గృహజ్యోతి లాంటి ఎన్నో సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులమయ్యాం. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నాయకత్వంలోనే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని విశ్వసించి, వారితో కలిసి నడవాలని నిర్ణయించుకొని కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది" అని పేర్కొన్నారు.



**గ్రామ అభివృద్ధికి పూర్తి సహకారం - ఎమ్మెల్యే సత్యం**

కాంగ్రెస్ పార్టీలో చేరిన రామడుగు సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శు భాకాంక్షలు తెలియజే శారు. గ్రామ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని, రామడుగు గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి పథకాన్ని గ్రామానికి తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. గ్రామ వార్డు సభ్యులు, ఎండి ఆరీఫ్, వెంకటే ష్, సిరికొండ సాయి తేజ, వెంకటేష్, యాగం రవి, అనిల్ తో పాటు దాదాపు 50 మంది గ్రామస్థాయి బిఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరినారు.

# రఘునాధపాలెం గిరిజన గ్రామాలకు రూ.110 కోట్లు ఇవ్వండి

**• కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ • వరద నీటి కాలువల నిర్మాణానికి నిధుల కోసం విజ్ఞప్తి • 37 పంచాయతీల్లో 28 ఏజెన్సీ, గిరిజన గ్రామాలు • శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ**





**ఖమ్మం ప్రతినిధి, జూన్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలోని రఘునాధపాలెం మండలంలో ఏజెన్సీ, గిరిజన గ్రామ పంచాయతీలకు వరద నీటి కాలువలు, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణం కోసం రూ.110 కోట్లు మంజూరు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. సోమవారం రాసిన ఈ లేఖలో మండలంలోని డ్రైనేజీ సమస్యలను మంత్రి వివరించారు. మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో 28 ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల పరిధిలోకి వస్తాయని మంత్రి తెలిపారు. వర్షాకాలంలో సరైన వరద నీటి కాలువలు లేక ఈ గ్రామాలు తీవ్ర నీటి నిల్వ, పారిశుధ్య సమస్యలను ఎదుర్కొంటున్నాయని, గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా వరద నీటి కాలువలు, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణానికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ పనులకు రూ.110 కోట్లు అంచనా వ్యయం అవుతుందని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన తన నియోజకవర్గ పరిధిలోని ఈ గిరిజన ప్రాంతాలకు సరిపడా స్థానిక వనరులు లేనందున, గ్రామీణాభివృద్ధి లేదా గిరిజన ప్రాంత అభివృద్ధి పథకాల ద్వారా నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని తుమ్మల కోరారు.ప్రతిపాదిత పనులు ఈ గిరిజన ప్రాంతాల్లో పారిశుధ్యం, ప్రజారోగ్యం, జీవన పరిస్థితులు, మొత్తం మౌలిక సదుపాయాలను గణనీయంగా మెరుగుపరుస్తాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. డీపీఆర్‌తో పాటు గ్రామ పంచాయతీల జాబితాను లేఖకు జతచేస్తూ, నిధుల మంజూరుకు సానుకూలంగా స్పందించాలని కేంద్ర మంత్రిని ఆయన అభ్యర్థించారు.

# ఏపీ తెలంగాణల్లో చోరీలకు పాల్పడిన దొంగల ముఠా గుట్టురట్టు

**నలుగురు అరెస్ట్..**

**రెండు మోటార్ సైకిళ్లు స్వాధీనం**

**వ్యవస్థీకృత నేరాల కింద కేసు నమోదు..**

**పరారీలో మరో నిందితుడి కోసం గాలింపు**





**పెనుబల్లి, జూన్ 23 ( పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వరుస దొంగతనాలకు పాల్పడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టును వి.యం. బంజర పోలీసులు రట్టు చేశారు. ముఠాలోని నలుగురు సభ్యులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు పెనుబల్లి మండలం లంకపల్లి గ్రామ శివారులోని ఓ తోట వద్ద మాణికల వసంతరావు, మాణికల రమేష్, పొన్నూరి కోటేశ్వరరావు, తుమ్మల శేఖర్ ఉన్నట్లు తెలుసుకున్న వి.యం. బంజర ఎస్సై వెంకటేష్ సిబ్బందితో కలిసి సోమవారం అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పంచుల సమక్షంలో విచారించగా పలు దొంగతనాలకు పాల్పడినట్లు వారు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. విచారణలో భాగంగా, లంకపల్లి గ్రామానికి చెందిన మాణికల వసంతరావు గతంలో పలు దొంగతనాలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చినట్లు వెల్లడైంది. అనంతరం పొన్నూరి రాంబాబు, మాణికల రమేష్, మాణికల సురేష్‌లతో కలిసి దొంగతనాలను వృత్తిగా మార్చుకున్నట్లు తెలిసింది. ఈ నలుగురు కలిసి ఆటోలో ఏలూరు జిల్లా చిన్నంపేటకు వెళ్లి, తాళం వేసి ఉన్న ఓ ఇంటిని గుర్తించారు. అర్ధరాత్రి సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి, ఇనుప బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు అపహరించి పరారైనట్లు విచారణలో తేలింది. ఇదే ముఠా ఏలూరు జిల్లా చిన్నంపేట, ఖమ్మం జిల్లా దుద్దెపూడి, సత్తుపల్లి, లంకపల్లి, కందుకూరు, అడవిమల్లెల గ్రామాల్లో వరుస చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. చిన్నంపేటలో రూ.80 వేల విలువైన బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదు, దుద్దెపూడిలో 20 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి ఆభరణాలు, సత్తుపల్లిలో ఆలయ హుండీ నుంచి రూ.5 వేల నగదు, లంకపల్లిలో 108 గ్రాముల బంగారం, 900 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.20 వేల నగదు అపహరించినట్లు విచారణలో వెల్లడైంది. అలాగే తుమ్మల శేఖర్, పొన్నూరి కోటేశ్వరరావు కూడా ముఠాలో చేరి కందుకూరు గ్రామంలో 20 గ్రాముల బంగారం, ఒక కిలో వెండి ఆభరణాలు చోరీ చేసినట్లు, మరోసారి అదే గ్రామంలో చోరీకి యత్నించినప్పటికీ ఎటువంటి ఆస్తి నష్టం జరగలేదని పోలీసులు తెలిపారు. అడవిమల్లెల గ్రామంలో 45 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.3.70 లక్షల నగదు అపహరించినట్లు గుర్తించారు. ఈ కేసులో అరెస్టయిన నిందితులు మాణికల వసంతరావు, మాణికల రమేష్ లంకపల్లి గ్రామానికి చెందినవారు కాగా, పొన్నూరి కోటేశ్వరరావు, తుమ్మల శేఖర్ ఏలూరు జిల్లా చాత్రాయి మండలం తుమ్మగూడెం గ్రామానికి చెందినవారని పోలీసులు తెలిపారు. నిందితులపై గతంలోనే పలు దొంగతనం కేసులు నమోదై ఉండటంతో వి.యం. బంజర పోలీస్ స్టేషన్‌లో హిస్టరీ షీట్లు తెరిచినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రాలేదని పేర్కొన్నారు. తిరిగి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతుండటంతో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 111 కింద వ్యవస్థీకృత నేరాల కేసు నమోదు చేయడంతో పాటు పీడీ చట్టం కింద చర్యలు చేపట్టనున్నట్లు పోలీసులు వెల్లడించారు. అరెస్టు చేసిన నలుగురిని రిమాండ్ నిమిత్తం సత్తుపల్లి కోర్టుకు తరలించినట్లు, పరారీలో ఉన్న మరో నిందితుడి ఆచూకీ కోసం ప్రత్యేక గాలింపు బృందాలు పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ ముత్తు లింగం, ఎస్ఐ వెంకటేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యమకారుల పోరాట ఫలితమే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం

**- ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి**

**- డాక్టర్ పిడమర్తి రవి, డాక్టర్ కెవి కృష్ణారావు**

**- తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ**



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉద్యమకారులు చేసిన పోరాటం ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ పిడమర్తి రవి, డాక్టర్ కెవి కృష్ణారావు లు అన్నారు. ఈ నెల 28వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న "తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం" పోస్టర్‌ను ఖమ్మం నగరంలోని స్థానిక ఎన్7 స్టూడియోలో మంగళవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేలాది మంది ఉద్యమకారులు తమ జీవితాలను త్యాగం చేశారని, వారి పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. అయితే రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులు నేటికీ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ప్రకటించిన 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25,000 గౌరవ పెన్షన్, ప్రత్యేక ఆరోగ్య బీమా సౌకర్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ఉద్యమకారుల ప్రత్యేక కోటా, అలాగే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన, ఉద్యమకారుల గౌరవ పరిరక్షణ, వారి హక్కుల సాధనే లక్ష్యంగా ఈ సమ్మేళనం జరుగు తుందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు, విద్యార్థి నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, యువత పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు నందిగామ రాజ్ కుమార్ (జానీ), బొబ్బిలి భరత్ చంద్ర, వేల్పుల మురళీ, విజయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌పై మైనారిటీలు ఆందోళన,అపోహలను వీడండి

**- బిజెపి మైనార్టీ మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్**



**కరీంనగర్ టౌన్ జూన్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – సర్) ప్రక్రియపై మైనారిటీ వర్గాల్లో ఉన్న అపోహలను వీడాలని బీజేపీ మైనారిటీ మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ కోరారు. మంగళవారం కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో జన సంగ్ వ్యవస్థాపకులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి ముజీబ్ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యాం ప్రసాద్ ముఖర్జీ కలలు కన్న ఒకే దేశం ఒకే రాజ్యాంగాన్ని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం ఈనెల 25 నుండి ప్రారంభం కాబోతున్న ఎస్ ఐ ఆర్ విషయంలో మైనార్టీ ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు ఒత్తిడికి గురికావద్దన్నారు. ఈ విషయంలో అనవసరమైన భయాందోళనలకు లోనుకావాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. అక్రమ ఓట్ల తొలగింపు ప్రక్రియ లో ముఖ్యంగా పరాయి దేశాల నుంచి వచ్చి, అక్రమంగా భారత దేశంలో ఓటు హక్కు పొందిన వారిని గుర్తించి, అటువంటి అక్రమ ఓట్లను తొలగించే అవకాశం మాత్రమే ఈ ప్రక్రియలో ఉందని ఆయన వివరించారు. దీనివల్ల భారతీయ పౌరులైన వారికి ఎటువంటి ఇబ్బంది కలగదన్నారు. ఎస్ ఐ ఆర్ అనేది ప్రతి 20 ఏళ్లకు ఒకసారి దేశవ్యాప్తంగా జరిగే సాధారణ ప్రక్రియ అని, దీనిని కేవలం పరిపాలనా పరమైన చర్యగా చూడాలని ఆయన సూచించారు. ఇది రాజకీయ కోణంలో చేసేది కాదని ఆయన స్పష్టం చేశారు. దేశ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా ఉంచేందుకు, అర్హులైన వారికే ఓటు హక్కు ఉండేలా చూడటానికి ఈ రివిజన్ చేపడుతున్నట్లు తెలిపారు. ఇది ఏ ఒక్క వర్గాన్ని లక్ష్యంగా చేసుకున్నది కాదని, కేవలం నిబంధనల మేరకు అక్రమ ఓట్లను తొలగించి, జాబితాను సరిచేసే ప్రక్రియ మాత్రమేనన్నారు. వదంతులను నమ్మవద్దని, వాస్తవాలను గ్రహించాలని ఆయన మైనారిటీ సోదరులకు విజ్ఞప్తి చేశారు.

# శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగా మోదీ ప్రభుత్వం

**కాంగ్రెస్ ముక్త్ భారత్ లక్ష్యం**

**నెరవేరే సమయం ఆసన్నమైంది..**

**కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్,**

**బోయినపల్లి ప్రవీణ్ రావు**



**కరీంనగర్ టౌన్ జూన్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ కన్న కలలను ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అక్షరాలా నెరవేరుస్తోందని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు అన్నారు.. శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా మంగళవారం రోజున కరీంనగర్ పార్లమెంటు కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రావు ముందు శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు ఆయన చేసిన కృషిని, త్యాగాలను ప్రవీణ్ రావు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్ దిశగా మోదీ ప్రభుత్వం అడుగులు వేస్తోందని, జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేయడం ద్వారా ముఖర్జీ ఆశయాలకు నిజమైన నివాళి అర్పించామని తెలిపారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని, ఆయన మార్గంలోనే దేశాభివృద్ధి జరుగుతోందన్నారు.దేశ ప్రజలందరూ ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపరుస్తు న్నారని, దేశంలో కాంగ్రెస్ ముక్త్ భారత్ అయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ప్రవీణ్ రావు జోస్యం చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలు, అవినీతితో నిండిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు తిరస్కరిస్తున్నారని, రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా బీజేపీ తిరుగులేని శక్తిగా అవతరిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు సామాన్యులకు అందుతున్న తీరును చూసి , ప్రధాని మోదీ 12 ఏళ్ల పాలన ను చూసి ప్రతిపక్షాలు బెంబేలెత్తి పోతున్నాయన్నారు.

# తల్లాడలో ఘనంగా ముస్లిం సోదరుల పీర్ల ఊరేగింపు



**తల్లాడ, జూన్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు మంగళవారం తల్లాడ పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ముస్లిం సోదరుల పవిత్ర పండగ మొహరం పండుగలో భాగంగా ఏడో రోజు కావడంతో డప్పు వాయిద్యాలు, మేళ్ల తాళాల నడుమ పీర్లను చేత పట్టుకొని ముస్లిం సోదరులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణ వ్యాప్తంగా తల్లాడ ప్రధాన రహదారుల్లో ముస్లిం సోదరులు ర్యాలీ నిర్వహించారు. పీర్ల సావిడి వద్ద హోమగుండంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పీర్ల ముజావర్ ఎస్ కే ఈసుఫ్ మాట్లాడుతూ మొహర్రం ముస్లింలకు ప్రత్యేక పర్వదినం అని, అసేన్, హుస్సేన్లను ప్రత్యేకంగా ఆరాధిస్తూ పండుగను జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 25వ తేదీన సంతానం లేని వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 29వ తేదీన చివరి రోజు కావడంతో భారీ ఎత్తున ర్యాలీతోపాటు ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. ముస్లిం సోదరులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నన్నేసా, అక్బర్, జానీ, ఖాసిం, నాగులు, మహారాజ్, చానా, సుభాని, యాసిన్, బాజీ, మహిళలు చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విత్తన మేళాకు అందరూ ఆహ్వానితులే....

**● రైతు వేదిక కంటాయపాలెం ఏర్పాటు ● రైతు వేదిక ద్వారా విత్తనాలు పంపిణీ కార్యక్రమం**

**తొరూర్ ప్రతినిధి, జూన్ 23(పిసీడబ్ల్యూ న్యూస్):** మహబూబా జిల్లా తొర్రూరు మండలంలోని కంటా య పాలెం రైతు వేదిక భవనంలో రైతుల పై, ఎరువుల వినియోగం పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.కంటాయపాలెం, మడిపల్లి, గుర్తూరు, సోమవరపుకుంట తండా రైతులందరికీ , రైతులకు నాణ్యమైన విత్తనాలు, పప్పుధాన్యాల విత్తనాలు మరియు ఆధునిక ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించుటకు విత్తన మేళా (విత్తనాల అమ్మకం) ను 23-06-2026 మంగళవారం నుండి 30-06-2026 మంగళవారం వరకు వారం రోజులు నిర్వహించబడుతుందని వ్యవసాయ శాఖ అధికారి ఆమని తెలిపారు.ఈ విత్తన మేళాలో క్రింది వరి రకాల విత్తనాలు ప్రభుత్వం బోనస్ అమలు చేసేవి అందుబాటులో ఉన్నాయని అన్నారు.- బి పి టి 5204,- హెచ్ ఎం టి సోనా,- జై శ్రీరామ్,- కే ఎన్ ఎం 1638,- ఆర్ ఎన్ ఆర్ 15048,- డబ్ల్యూ జి ఎల్. 44,- కే ఎన్ ఎం7715, రకాలుఅదేవిధంగా వివిధ పప్పుధాన్యాల , అప్పరాలు,కూరగాయల విత్తనాలు, నానో యూరియా, నానో డీఏపీ (డి ఏ పి) తదితర వ్యవసాయ ఉత్పత్తులు కూడా రైతులకు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.ప్రజా ప్రతినిధులు మరియు వ్యవసాయ శాఖ అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించబడును. రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విత్తన మేళాకు హాజరై అవసరమైన విత్తనాలు మరియు వ్యవసాయ ఉత్పత్తులను పొందగలరని కోరుతున్నారు.వ్యవసాయ శాఖ ..కంటయపాలెం క్లస్టర్..తొర్రూర్ మండలం.



# ఇందిరమ్మ ఇండ్లతో వెలుగుమట్ల పేదల సొంతింటి కల సాకారం



**- ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి**

**- వెలుగుమట్ల లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం.. వేగంగా సాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు**

**- నిర్దిష్ట గడువులోగా పనులు జరిగేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలి**


**- వెలుగుమట్లలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ఖమ్మం ప్రతినిధి, జూన్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రభుత్వం పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం ఖమ్మం నగర పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో తిరుగుతూ నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను ఒక్కొక్కటిగా పునాదుల నిర్మాణం, గోడల నిర్మాణం, పైకప్పు పనులు, తుదిదశ పనుల పురోగతిని పరిశీలించారు. ప్రతి ఇంటి నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తూ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా సహకరించాలని హౌసింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఇంటి నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, నిర్మాణ దశల వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీసి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఇండ్ల నిర్మాణాలు ప్రభుత్వం ప్రత్యేక చొరవతో వేగంగా కొనసాగు ఉన్నాయని తెలిపారు. వెలుగుమట్ల కాలనీకి ప్రధాన రహదారి, వాటర్ సౌకర్యం, విద్యుత్ స్తంభాలు పూర్తిస్థాయిలో లైట్లు ఏర్పాటు చేశామన్నారు. ఆదేవిధంగా ఇండ్లకు విద్యుత్ కనెక్షన్ తో పాటు మీటర్లు అమరుస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు స్థిరమైన గృహ వసతి కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని అన్నారు. ఇంటి నిర్మాణం వివిధ దశలను పూర్తిచేసిన వెంటనే ప్రభుత్వ ఆర్థిక సహాయం విడతల వారీగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోందన్నారు. పునాదుల నిర్మాణం పూర్తయిన తర్వాత, గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత, స్లాబ్ దశ పూర్తయిన తర్వాత, తుదిదశ పనులు పూర్తయిన తర్వాత మొత్తం రూ.5 లక్షల వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైనప్పటికీ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పునాది దశ పనులు ప్రారంభించలేని కుటుంబాలకు మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ అన్నారు. స్వయం సహాయక సంఘాల సహకారంతో లబ్ధిదారులు నిర్మాణ పనులు నిలిచిపోకుండా కొనసాగించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల విషయంలో రెవెన్యూ, హౌసింగ్, విద్యుత్, మున్సిపల్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు, సాంకేతిక సహాయం, పరిపాలనా అనుమతులు సకాలంలో అందించడంతో పాటు లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీ లో కలెక్టర్ వెంట హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, విద్యుత్ ఎస్ఇ శ్రీనివాసచారి, ఈఈ జగ్గారావు, హౌసింగ్ ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి నివేదిక కార్యక్రమ విజయాలను కేస్ స్టడీలుగా నమోదు చేయాలి


**● జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి ● ప్రతి శాఖ విజయాలు, ఉత్తమ పద్ధతులు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వివరాలతో సమగ్ర నివేదికలు రూపొందించాలి ● గురుకులాల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండకుండా చర్యలు తీసుకోవాలి ● ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక కొరత తలెత్తకుండా చర్యలు చేపట్టాలి ● ప్రతి శాఖ విజయగాథలు, ఉత్తమ ఫొటోలతో ఐదు రోజుల్లో ప్రత్యేక బుక్‌లెట్ సిద్ధం చేయాలి ● 99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళికపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా ప్రత్యేక అధికారి**



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** 99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో సాధించిన విజయాలను కేస్ స్టడీల రూపంలో నమోదు చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి, గనుల శాఖ ప్రత్యేక కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత జిల్లా అధికారులతో 99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళిక అమలుపై సమీక్షించారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు తమ శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలను వివరించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి, జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల కార్యక్రమం విజయగాథలను గుర్తించి నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రతి శాఖ తమ విజయాలు, సాధించిన ఫలితాలు, ఉత్తమ పద్ధతులు, ప్రజలకు కలిగిన ప్రయోజనాలను సంక్షిప్తంగా పొందుపరుస్తూ నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు.ప్రతి శాఖ నివేదికలో స్పష్టమైన వివరాలు ఉండాలని, ఇతర జిల్లాల్లో అమలు చేయదగిన ఉత్తమ పద్ధతులను ప్రత్యేకంగా పేర్కోవాలని తెలిపారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు, వాటి ప్రస్తుత స్థితి, పరిష్కార వివరాలను కూడా నివేదికల్లో పొందుపరచాలని సూచించారు. పాలేరు నియోజక వర్గంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో అందిన దరఖాస్తులు, పరిష్కరించిన సమస్యలు, పెండింగ్ దరఖాస్తుల వివరాలతో ప్రత్యేక నివేదిక సిద్ధం చేయాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు, బ్లాక్ స్పాట్‌ల సవరణ చర్యల వల్లమరణాల సంఖ్యలో వచ్చిన తగ్గుదలను గత ఏడాది గణాంకాలతో పోల్చి చూపించాలని, ప్రమాదాల తగ్గుదల స్పష్టంగా ప్రతిబింబించేలా నివేదికలు రూపొందించాలని సూచించారు. జిల్లాలోని గురుకుల రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండకూడదని, నిరుపేదలు, అనాథలు,ఒంటరి తల్లిదండ్రుల పిల్లలకు ప్రాధాన్యతనిస్తూ ఖాళీ సీట్లను భర్తీ చేయాలని సూచించారు. మంచి విద్య పిల్లలకు జీవితాంతం ఉపయోగపడే గొప్ప బహుమతి అని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు టీజీఎంఐడీసీ, మన ఇసుక వాహనం ద్వారా ఉచిత ఇసుక సరఫరా చేస్తున్నామని, ఖమ్మంజిల్లాలో ఇసుక సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. ప్రతి నియోజక వర్గంలో నాణ్యమైన ఇసుక బజార్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక కేటాయింపులు కూడా టీజీఎంఐడీసీ ద్వారా జరుగుతున్నాయని చెప్పారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశానికి అన్ని శాఖలు తమ అవసరమైన ఇసుక ప్రతిపాదనలు పంపాలని సూచించారు.99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళికపై రూపొందించే బుక్‌లెట్‌లో ప్రతి శాఖ విజయ గాథలు, ఉత్తమ కేస్ స్టడీలు, థీమ్ వారీగా ఎంపిక చేసిన ఉత్తమ ఫొటోలను పొందుపరచాలని సూచించారు. బుక్‌లెట్ పరిమాణం కంటే నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఐదు రోజుల్లో బుక్‌లెట్ పూర్తి చేయాలని ఆదేశించారు.99 రోజుల కార్యక్రమంలో ప్రారంభమైన పనులకు సంబంధించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను కూడా బుక్‌లెట్‌లో చేర్చాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యాచరణకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో అధికారులు ఇప్పటివరకు అద్భుతంగా పనిచేశారని అభినందించారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఖమ్మం జిల్లాలో 99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళికను విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. మార్చి 6 నుండి మార్చి 15 వరకు నిర్వహించిన పరిశుభ్రత, ఫైల్ క్లియరెన్స్ కార్యక్రమంలో 11,326 ఫైళ్లను పరిష్కరించామని తెలిపారు. జిల్లాలోని 571 గ్రామాలు, 177 పట్టణ వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.మాతృ మరణాల రేటును సున్నాకు తీసుకురావాలనే లక్ష్యంతో తల్లి ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. “ప్రతి ప్రసవం సురక్షితం“ కార్యక్రమం ద్వారా హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ తో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మొబైల్ ఎక్స్‌రే వాహనాల ద్వారా ప్రత్యేక శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల నిర్మూలన కార్యక్రమాలు, రోడ్డు భద్రత చర్యలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. బాలల భద్రత వారోత్సవాలు నిర్వహించి అన్ని విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. 53 మంది అనాథ పిల్లలకు ఆధార్ కార్డులు, జనన ధృవీకరణ పత్రాలు, కుల ధృవీకరణ పత్రాలు, ఆరోగ్యశ్రీ కార్డులు అందించినట్లు తెలిపారు. జిల్లాలో నిర్వహించిన జాబ్‌మేళా ద్వారా 610 మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. వ్యవసాయ వారోత్సవాలు నిర్వహించి రైతు భరోసా, నానో యూరియా వినియోగం, రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, పంట అవశేషాల దహనం నివారణ, వ్యవసాయ యాంత్రీకరణ, ఆయిల్ పామ్ సాగు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నేల ఆరోగ్య నిర్వహణపై విస్తృత అవగాహన కల్పించినట్లు తెలిపారు. అలాగే విద్యా వారోత్సవాలు, యువజన, క్రీడా వారోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. మహిళల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మునిసిపల్ కమీషనర్ లు, తదితరులు పాల్గొన్నారు.

# శ్యాం ప్రసాద్ ముఖర్జీ దేశం కోసం చేసిన సేవలు, త్యాగం మరువలేనిది...



**బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**

**కరీంనగర్ టౌన్ జూన్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, మహనీయులు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ దేశం కోసం చేసిన సేవలు, త్యాగం మరువలేనివని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బిజెపి హుజురాబాద్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్ వేడుకను నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ముందుగా శామ ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగాగంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ “ఒకే దేశం, ఒకే జెండా, ఒకే రాజ్యాంగం“ ఉండాలనే లక్ష్యంతో అహర్నిశలు పోరాడిన గొప్ప దేశభక్తుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు.దేశ సమగ్రతను కాపాడటంలో శ్యామా ప్రసాద్ చేసిన పోరాటం, ప్రాణత్యాగం భారత రాజకీయ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిందన్నారు. డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. దేశ సమగ్రత కోసం, జమ్మూ కాశ్మీర్‌లో ప్రత్యేక రాజ్యాంగం ఉండకూడదని (ఏక్ దేశ్ మే దో నిషాన్, దో విధాన్, దో ప్రధాన్ నహీ చలేంగే) పోరాటం చేస్తూ 1953 జూన్ 23న ఆయన కస్టడీలో ప్రాణాలు అర్పించారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ కన్న కలలను , ఆశయాలను మోడీ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ఆ దిశలోనే ఆర్టికల్ 370 రద్దు చేసి మోడీ ప్రభుత్వం డాక్టర్ శ్యామ ప్రసాద్ కు ఘనమైన నివాళులు అర్పించిందన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు తూర్పాటిరాజు కార్యక్రమ జిల్లా కో కన్వీనర్ పట్టణ మాజీ అధ్యక్షులు గంగిశెట్టి రాజు పట్టణ కన్వీనర్స్ జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు సెంటర్ ఫిలిం బోర్డ్ మెంబర్ సబ్బని రమేష్ జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టిప్రభాకర్ తూముల శ్రీనివాస్ సీనియర్ నాయకులు నరాల రాజశేఖర్ తిప్పభతిని రాజు యాళ్ల సంజీవరెడ్డి బోరగాల సారయ్య కొయ్యడ శ్రీనివాస్ పడారి కొమురయ్య కొలిపాక వెంకటేష్ గుర్రం సంతోష్ మొలుగూరి నగేష్ మంచికట్ల మురళి కొలుగూరి అనిల్ పడారి సుమన్ ఎర్ర శ్రీధర్ బోడిగే రాధ మోటపోతుల రాకేష్ యాట రాజేష్ నీలం రవీందర్ ఐత సందీప్ క్యాస వెంకటేష్ కొడిమ్యాల పవన్ వోడ్నాల విజయ్ అనంతుల విక్రమ్ పర్థం విజయ్ వీరయ్య గంధం సంతోష్ తూర్పాటి అరవింద్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జ్యువెలరీ షాపు దోపిడీ దొంగలను పట్టుకున్న పోలీసు కమిషనర్‌కు ఎంఐఎం నేతల సన్మానం




**కరీంనగర్ టౌన్ జూన్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పీఎంజే జ్యువెలరీ షోరూంలో మే 3న జరిగిన సంచలన దోపిడీ కేసులో ముఖ్య నిందితుడితో పాటు, కరుడుగట్టిన మరో ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు, వారి నుంచి కీలకమైన ఆధారాలు, ఆయుధాలను స్వాధీనం చేసుకున్న కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంను, పోలీసు కమిషనర్ కార్యాలయంలో మంగళవారం ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో, ఎంఐఎం కార్పొరేటర్లు, నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి, పూల బోకేను అందించి, శాలువా తో సన్మానించారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఈకేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని, దేశంలో వివిధ రాష్ట్రాల లో పెద్ద పెద్ద దోపిడీలు చేసి, పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న కరుడుగట్టిన నిందితులను, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, మెరుగైన నెట్వర్క్ తో చాకచక్యంగా పట్టుకొని, విమర్శకుల నోర్లు మూయించి, తెలంగాణ పోలీసు బెటర్ పోలీసు అనేట్లు, కరీంనగర్ పేరును దేశం గర్వించే స్థాయిలో, వన్నె తెచ్చిన పోలీసు కమిషనర్ గౌష్ ఆలం సేవలు ప్రశంసనీయమని అభినందించారు. నేరస్థులకు పాలిట సింహస్వప్నంలా మారి, నేర రహిత సమాజం కోసం అహర్నిశలు కృషి చేస్తూ, ప్రభుత్వానికి మంచి పేరును తీసుకురావడం, ఇలాంటి నిజాయితీ గల మంచి అధికారి కరీంనగర్ లో సేవలను అందించడం జిల్లా ప్రజల అదృష్టమన్నారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం జాయింట్ సెక్రటరీ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి, కో కార్పొరేటర్ సయ్యద్ ఇబ్రహీం, కార్పొరేటర్ మాజిద్ హుస్సేన్, మాజీ కార్పొరేటర్లు ఆరిఫ్ అహ్మద్, అహ్మద్ మొహియుద్దీన్ బాబుజానీ, లింగంపల్లి శ్రీను, కంటెస్టేడ్ కార్పొరేటర్లు సురేశ్, వాజిద్ అలీఖాన్, అబ్దుల్ గఫ్ఫార్, అబ్దుల్లా ఆసిమ్, నాయకులు ఫసియుద్దీన్ ఖాలీద్, ఎంఏ సలీం, ఖమరొద్దీన్ షబ్బీర్, అబ్దుల్లా ఖాన్, మేరాజ్, ఇలియాజ్, అల్మాస్ హంజ, యునూస్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన డిపో మేనేజర్‌ను కలిసిన ఈయు సభ్యులు..

**తొర్రూరు ప్రతినిధి ,జూన్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ రీజినల్ లోని తొరూర్ టీజీఎస్ ఆర్టీసీ బస్ డిపో నూతన డిపోమేనేజర్ గా కే ప్రసూనలక్ష్మి మంగళవారం పదవి బాధ్యతలు చేపట్టారు. తొర్రూర్ డిపో మేనేజర్ గా క్రొత్తగా బాధ్యతలు స్వీకరించిన కె. ప్రసూన లక్ష్మి కి తొర్రూర్ డిపో ఈ యు సభ్యులు అంత కలిసి పుష్ప గుచం అందజేశారు.శాలువాతో సన్మానం చేసి పరిచయం చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా డి ఎం ప్రసంగిస్తూ ఉద్యోగులంతా ఎవరి విధులు వాళ్ళ సక్రమంగా చేసుకోని డిపో అభివృద్ధికి సహకరించాలని అంతేకాకుండ ప్రయాణికులను తమ తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చి డిపో ఆదాయాన్ని పెంచలన్నారు..గతంలో లాగానే రీజియన్ లోనే తొర్రూర్ డిపోను మొదటి స్థానంలో నిలిచే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ కుమార్,జె. యాదగిరి,ఎం కే రావు, ఎస్. యాకన్నా, ఎం. సతీష్, ర్. సత్తయ్య, వనజ, రాజేశ్వరి, శ్రీలత, రాధిక, టి.ధనుంజయ, టి వై రెడ్డి, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రతి రైతుకు యూరియా సరఫరా చేయాలి

**● పెండింగ్ రైతు భరోసా నిధులు విడుదల చేయాలి ● నాణ్యమైన విత్తనాలు రైతులకు అందించాలి**

**● తెలంగాణ రైతు సంఘం తొర్రూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా**




**తొర్రూరు ప్రతినిధి ,జూన్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):**మహబూబాబాద్ జిల్లా తోరూర్ మండలంలోని సాగు భూమి కలిగిన ప్రతి రైతుకు యాప్ తో సంబంధం లేకుండా యూరియా సరఫరా చేయాలి అని, పెండింగ్ లో ఉన్న రైతు భరోసా నిధులు విడుదల చేయాలని, రైతు సంఘం జిల్లా నాయకులు బొల్లం అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రోజు తొర్రూరు మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం తొర్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఆర్ ఐ విక్రమ్ జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ రెడ్డి లకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు బొల్లం అశోక్, మండల కార్యదర్శి కొత్త వెంకట్ రెడ్డిలు ప్రసంగిస్తూ, వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని రైతులకు కల్తీ విత్తనాలు, పురుగుమందులు అందకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన విత్తనాలు రైతులకు సరఫరా చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదలకు అవకాశం ఉంటుంది అని , కల్తీ,నాసిరకం విత్తనాలు పంపిణీ చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు భరోసా నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంట కాలువలు మరమ్మతులు లేక చివరి భూములకు సాగునీరు ప్రవహించే అవకాశం లేకుండా పోయింది అని పంట కాలువలు మరమ్మతులు చేయాలి అని అన్నారు. రబి సీజన్లో మార్కెట్ ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్న రైతులకు పెండింగ్ డబ్బులను వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంవత్సరం కరువు పరిస్థితులు రాబోతున్నట్టు తెలుస్తుందని అందుకోసం ప్రభుత్వం తక్షణ స్పందించి యాక్షన్ ప్లాన్ రూపొందించి రైతులను ఆదుకోవాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎండి యాకూబ్ , మండల అధ్యక్షురాలు అందే మంజుల రైతు సంఘం నాయకులు తాళ్ల వెంకటేశ్వర్లు వీరయ్య, కోటగిరి సంతోష్, శ్రీరంగం రాధా రామకృష్ణ, భాగ్య ,సమీనా, అమీనా, శ్రీలత ,లక్ష్మి ,స్వర్ణ, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# సర్ సమీక్ష సమావేశానికి హాజరైన ఎంఐఎం నేతలు



**కరీంనగర్ టౌన్ జూన్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశానికి ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎంఐఎం కార్పొరేటర్లు నాయకులు మంగళవారం హాజరయ్యారు. ఎంఐఎం పార్టీ అధినేత హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు గత ప్రజావాణి కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ తరఫున చేసిన వినతి మేరకు జిల్లా కలెక్టర్ అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఈ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సందర్శన చేపట్టి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు తెలుగు భాషతోపాటు ఇంగ్లీష్ భాషలను పంపిణీ చేయాలని ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ ప్రక్రియలో బీఎల్ఏలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించి అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం లోని దాదాపు 390 బూతులలో బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు బిఎల్ఏ -2 లను నియమించినట్లు చెప్పారు ఎంఐఎం పార్టీ కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు నాయకులు డివిజన్ల అధ్యక్షులు కార్యకర్తలు ఎస్ ఐ ఆర్ కు సంబంధించిన అంశంలో పాల్గొంటారని ప్రజలకు విస్తృతంగా సేవలను అందిస్తారని గులాం అహ్మద్ చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో కార్పొరేటర్లు సయ్యద్ ఇబ్రహీం, మాజీద్ హుస్సేన్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు అహ్మద్ మోహియుద్దిన్ బాబు జాని, మాజీ కార్పొరేటర్ లింగంపల్లి శ్రీనివాస్, నాయకులు వాజిద్ అలీ ఖాన్, అసిమ్, సురేష్, అబ్దుల్లా ఖాన్, ఖదీర్ షా ఖాన్, సామాజిక కార్యకర్త ముజీబ్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో అప్రమత్తంగా ఉండాలి:ఎస్పీ విక్రాంత్ పాటిల్

**సీఎం పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు**

**1,200 మంది పోలీసులతో భారీ బందోబస్తు**





**కర్నూలు జూన్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 24న పత్తికొండ నియోజకవర్గంలోని జొన్నగిరి వద్ద ఉన్న జియో మైసూర్ గోల్డ్ మైన్స్ ప్లాంట్‌ను సందర్శించనున్న నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా హెలిప్యాడ్, సభా ప్రాంగణం, ప్రయాణ మార్గాలు తదితర ప్రాంతాల్లో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని పగిడిరాయి గ్రామ సమీపంలో గోల్డ్ మైన్స్ ప్రాంతంలో విధులకు హాజరైన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రత్యేకంగా దిశానిర్దేశం చేశారు.భద్రతా ఏర్పాట్లలో భాగంగా మొత్తం 1,200 మంది పోలీసు సిబ్బందిని విధుల్లో నియమించారు. వీరిలో ముగ్గురు అదనపు ఎస్పీలు, 14 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 76 మంది ఎస్సైలు, 300 మంది ఏఆర్, ఏపీఎస్పీ, స్పెషల్ పార్టీ సిబ్బంది ఉన్నారు.విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని ఎస్పీ ఆదేశించారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కర్నూలు అదనపు ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, కడప అదనపు ఎస్పీ ప్రకాష్ బాబు, నంద్యాల అదనపు ఎస్పీ చిన్ని కృష్ణ, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చైర్మన్ నరేందర్ రెడ్డిని సన్మానించిన ఆర్ఎంపీపీఎంపీ టౌన్ సంఘం ప్రతినిధులు..



**కరీంనగర్ టౌన్ జూన్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆర్ఎంపీపీఎంపీ టౌన్ అధ్యక్షుడు ఎండి లియాకత్, ప్రధాన కార్యదర్శి టి. శంకర్, కోశాధికారి డి. ప్రభాకర్ శ్రీ (సుదా)లు మంగళవారం చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీపీఎంపీ వైద్యుల సమస్యలు, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల ప్రాధాన్యత వంటి పలు అంశాలపై చర్చించారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఆర్ఎంపీపీఎంపీ వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. అలాగే వైద్య రంగ అభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు. చైర్మన్ నరేందర్ రెడ్డి సంఘం ప్రతినిధుల అభిప్రాయాలను ఆసక్తిగా విని, ప్రజా ఆరోగ్య పరిరక్షణలో వైద్యుల సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు.అనంతరం సంఘం నాయకులు చైర్మన్‌ను శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో సాగగా, పరస్పర సహకారంతో ప్రజా సేవలను మరింత విస్తరించేందుకు కృషి చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో సంఘానికి చెందిన పలువురు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చేయకుండా మీరు జిల్లాకు రావద్దు


**ప్రజలకు ఉపయోగం లేని కంపెనీ కోసం ఇంత ఆర్భాటం అవసరమా..?**

**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు న్యాయవాది క్రాంతి నాయుడు.**




**కర్నూలు జూన్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లాకు వచ్చి ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలు చేశారని, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు క్రాంతి నాయుడు ప్రశ్నించారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో క్రాంతి నాయుడు మాట్లాడుతూ కర్నూలు జిల్లా పత్తికొండ నియోజక వర్గానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వస్తున్నారని, గతంలో ఎన్నోసార్లు జిల్లాకు వచ్చారని ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదనీ ప్రశ్నిస్తున్నామని, రేపు పత్తికొండ నియోజకవర్గం గోల్డ్ మైన్స్ సర్వే చేశారని వాటిలో అవకతవకులు ఉన్నాయని బేరైటీస్ ఉత్పత్తిలో భిన్నాభిప్రాయాలు తెలియజేస్తున్నారని ప్రభుత్వము సంవత్సరానికి 1000 కేజీలు ఇస్తామంటున్నారని, జిల్లా అధికారులు 30 కేజీలు తీస్తున్నాం అని చెబుతున్నారని స్థానికంగా భూములు ఇచ్చిన రైతులు మరియు స్థానిక యువతకు ఎంతవరకు మీరు ఉద్యోగ అవకాశాలు కల్పించారని ఎంతమంది ఇంజనీర్లను ఉపయోగించుకున్నారని కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రశ్నిస్తున్నామని 30 సంవత్సరాల లీజు ఇప్పటికీ 10 సంవత్సరాలు పూర్తయిందని మైనింగ్ జరిగే చోట యువతకు వృత్తివిద్య కోర్సులు ఏమైనా ఇచ్చారని ప్రశ్నించారు. జిల్లాకు పదేపదే వస్తున్న ముఖ్యమంత్రి గారు కర్నూలు జిల్లాకు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులకు నిధులు హాస్పిటల్స్ మరియు ఆదోని మెడికల్ కాలేజీకి నిధులు విడుదల చేయాలని రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన జిల్లా కర్నూలు జిల్లా మాత్రమే అని మైనింగ్ విషయానికి వస్తే ప్రభుత్వం నడపకుండా ప్రైవేట్ సంస్థకు ఇవ్వడం వల్ల వారు కేవలం లాభాపేక్ష చూసుకుంటారని 2024 25వ సంవత్సరం వారు కట్టిన ట్యాక్స్ కేవలం 20 లక్షలు మాత్రమే అని ప్రభుత్వం కేవలం షో చేస్తుంది తప్ప ఈ ప్రాంతానికి ఎటువంటి ఉపయోగం లేదని మీరు కర్నూలు జిల్లాను అభివృద్ధి చేయాలనుకుంటే పరిశ్రమలు గాని కియా తరహాలో పరిశ్రమలు గానీ ఈ ప్రాంతంలో పెట్టలేకపోతున్నారని ప్రశ్నించారు. విద్యా, ఉపాధి కోసం వలసలు పోతున్న ప్రాంతం కేవలం కర్నూలు జిల్లా అని క్రాంతి నాయుడు గారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, ఎస్సీ సెల్ మాజీ జిల్లా చైర్మన్ ఈ లాజరస్, ఐ ఎన్ టి యు సి సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్ మొదలగు వారు పాల్గొన్నారు.

# షుగర్ వ్యాధితో అవయవాలు కోల్పోయిన పాషాకు వికలాంగుల పింఛన్, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వినతి




**కరీంనగర్ టౌన్ జూన్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని హుస్నేనిపుర డివిజన్‌కు చెందిన మొహమ్మద్ పాషా షుగర్ వ్యాధితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యాధి కారణంగా ఆయన రెండు కాళు , చేతి వేళ్లను కోల్పోయి ఎలాంటి పని చేసుకోలేని స్థితిలో ఉన్నారు.పాషాకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నప్పటికీ కుటుంబానికి ఎలాంటి ఆర్థిక ఆధారం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున వికలాంగుల పింఛన్ మంజూరు చేయడంతో పాటు ఇందిరమ్మ గృహ పథకం కింద ఇల్లు కేటాయించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి తమ కుటుంబానికి అండగా నిలవాలని మొహమ్మద్ పాషా కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# నగర అభివృద్ధి, సుందరీకరణపై దృష్టి సారించాలి

**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**బద్వేలు మున్సిపాలిటీలో స్మార్ట్ జల పంపిణీ వ్యవస్థకు రూపకల్పన**



**కడప టౌన్ జూన్ 23(పిసిడబ్ల్యూ న్యూస్):-** కడప నగరంలో అధునాతన సాంకేతికతతో నాణ్యమైన నీటి సరఫరా వ్యవస్థతో పాటు.. పచ్చదనం, పరిశుభ్రతను మరింత మెరుగు పరచాల్సిన అవసరం ఉందని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో.. మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల పునరుద్ధరణ, బ్యూటిఫికేషన్ లతో పాటు బద్వేలు మున్సిపాలిటీలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన "స్మార్ట్ జల పంపిణీ వ్యవస్థ"ను అమలు చేసేందుకు చేపట్టిన ప్రణాళికలపై.. కడప నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎస్. భావన తోపాటు జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నీటి వనరుల సమర్థ వినియోగం, నీటి నష్టాల నివారణ, ప్రజలకు నాణ్యమైన తాగునీటి సరఫరా కోసం ఆధునిక సాంకేతికతను వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. బద్వేలు మున్సిపాలిటీలో ప్రతిపాదించిన విధానాన్ని పరిశీలించి కడప నగరంతో పాటు.. ఇతర మున్సిపాలిటీల్లోనూ అమలు చేసే అవకాశాలను అధ్యయనం చేయాలని సూచించారు. ఆయా పట్టణాల్లో నీటి సరఫరా వ్యవస్థ, మౌలిక వసతులు, సాంకేతిక అవసరాలపై నివేదిక సిద్ధం చేయాలని కమిషనర్లను ఆదేశించారు.బద్వేలు మున్సిపాలిటీలో నీటి సరఫరా వ్యవస్థను పూర్తిగా సాంకేతిక ఆధారితంగా మార్చే లక్ష్యంతో ఈ ప్రణాళిక రూపొందించబడిందని ప్రతినిధులు తెలిపారు. జలాశయాలు, జాక్‌వెల్‌లు, పంపు కేంద్రాలు, జల శు ద్ధి కేంద్రాలు, నిల్వ ట్యాంకులు, పంపిణీ పైపులైన్ల వద్ద ప్రత్యేక పర్యవేక్షణ పరికరాలను ఏర్పాటు చేసి నీటి మట్టాలు, ప్రవాహం, పీడనం, నీటి నాణ్యతను నిరంతరం పరిశీలించే విధంగా వ్యవస్థ పనిచేస్తుందని వివరించారు.నీటి లీకేజీలు, పైపు పగుళ్లు, ట్యాంకుల పొంగిపొర్లడం, పంపుల లోపాలు వంటి సమస్యలను వెంటనే గుర్తించి సంబంధిత అధికారులకు హెచ్చరికలు పంపే సదుపాయం ఉంటుందని తెలిపారు. దీంతో నీటి నష్టాన్ని గణనీయంగా తగ్గించడంతో పాటు నిర్వహణ వ్యయాలను కూడా నియంత్రించవచ్చని చెప్పారు.అలాగే జల శుద్ధి కేంద్రాల నుంచి ప్రజలకు చేరే వరకు నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. నీటిలో క్లోరిన్ స్థాయిలు, ఆమ్ల-క్షార సమతుల్యత, మసకదనం తదితర ప్రమాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించడం ద్వారా సురక్షితమైన తాగునీటిని అందించవచ్చని పేర్కొన్నారు.

# మా ఇంటి బంగారాన్ని అభినందించిన మెగాస్టార్

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం విడుదలైన తర్వాత మంచి స్పందనను అందుకుంటోంది. దర్శకుడు రాజ్ నిడిమోరుతో వివాహం అనంతరం సమంత నటించిన తొలి సినిమా కావడంతో ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. జూన్ 19న థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం పాజిటివ్ టాక్‌తో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా మంచి వసూళ్లను నమోదు చేస్తోంది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. సమంత, రాజ్ నిడిమోరు దంపతులతో పాటు దర్శకురాలు నందిని రెడ్డి, చిత్ర యూనిట్ సభ్యులను తన నివాసానికి ఆహ్వానించిన ఆయన, సినిమా విజయంపై శుభాకాంక్షలు తెలిపారు. సినిమా చూసిన అనంతరం చిరంజీవి తన అభిప్రాయాన్ని పంచుకుంటూ, మా ఇంటి బంగారం చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఉమ్మడి కుటుంబం నేపథ్యంలో యాక్షన్, భావోద్వేగాలను అందంగా మేళవిస్తూ దర్శకురాలు నందిని రెడ్డి తనదైన శైలిలో వినోదాత్మకంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు అని పేర్కొన్నారు. అలాగే సమంత నటనను ప్రత్యేకంగా ప్రశంసించిన ఆయన, సమంత నటన అద్భుతంగా ఉంది. ముఖ్యంగా చీరకట్టులో ఆమె చేసిన యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇటువంటి మహిళా ప్రాధాన్య చిత్రాలు తెలుగు సినీ పరిశ్రమకు అవసరం. ఈ విజయానికి సమంత, నందిని రెడ్డి, రాజ్ మరియు మొత్తం చిత్ర బృందానికి హృదయపూర్వక అభినందనలు అని తెలిపారు. మరోవైపు జీవితంలో కొత్త అధ్యాయాన్ని ఆహ్వానిస్తున్న సమంత, రాజ్ దంపతులకు ప్రత్యేక అభినందనలు అని ఆయన పేర్కొన్నారు. చిరంజీవి సతీమణి సురేఖ సమంత దంపతులకు కొత్త బట్టలు పెట్టి ఆశీర్వదించారు. ఈ కామెంట్



ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీసింది. ముఖ్యంగా 'కొత్త అధ్యాయం' అనే పదం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. దీనిపై సోషల్ మీడియాలో పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. సమంత ప్రగ్నెన్సీ విషయంలో చిరు ఈ కామెంట్ చేశారా అని పలువురు ముచ్చటించుకుంటున్నారు. ఇక జూన్ 19న విడుదలైన 'మా ఇంటి బంగారం' మొదటి రోజునుంచే ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంది. ముఖ్యంగా సమంత నటన, భావోద్వేగ సన్నివేశాలు, కుటుంబ నేపథ్యం, యాక్షన్ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

# పెద్ది తరవాత బుచ్చిబాబులో మార్పు

## కొత్త సినిమా కోసం వేగం పెంచాలని నిర్ణయం




టాలీవుడ్‌లో దర్శకుడు బుచ్చిబాబు సాన గురించి మాట్లాడినప్పుడు ముందుగా గుర్తుకొచ్చేది ఆయన కథలపై చూపించే నిబద్ధత. ఒక సినిమా పూర్తయిన వెంటనే మరో ప్రాజెక్ట్‌ను ప్రారంభించే దర్శకుల కంటే, కథను పూర్తిగా సిద్ధం చేసి, ప్రతి అంశాన్ని పక్కాగా మలిచిన తర్వాతే సెట్స్‌పైకి తీసుకెళ్లే దర్శకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అయితే ఇప్పుడు బుచ్చిబాబు తన పని విధానంలో కీలకమైన మార్పుకు సిద్ధమవుతున్నారనే చర్చ ఇండస్ట్రీలో జోరుగా సాగుతోంది. 'ఉప్పెన' సినిమాతో దర్శకుడిగా అద్భుతమైన అరంగేట్రం చేసిన బుచ్చిబాబు తొలి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకున్నారు. అయితే ఆ సినిమా తర్వాత వెంటనే కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించకుండా, తన రెండో చిత్రానికి అవసరమైన కథ, పాత్రలు, ప్రీ-ప్రొడక్షన్ పనులపై చాలా సమయం కేటాయించారు. దీంతో 'ఉప్పెన' తర్వాత ఆయన తదుపరి చిత్రం కోసం అభిమానులు, సినీ పరిశ్రమ దాదాపు కొన్ని సంవత్సరాలు ఎదురుచూడాల్సి వచ్చింది. చివరకు రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని అందుకుంది. 'పెద్ది' విజయం బుచ్చిబాబు కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా నిలిచింది. గ్రామీణ నేపథ్యం, భావోద్వేగాలతో కూడిన కథనం, పాత్రల రూపకల్పన, విజువల్ ట్రీట్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఆయన కథ చెప్పే తీరు, భావోద్వేగాలను తెరపై ఆవిష్కరించే విధానానికి విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభించాయి. గతంతో పోలిస్తే చాలా తక్కువ సమయంలోనే తన తదుపరి సినిమాను ప్రకటించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం టాలీవుడ్‌లో పోటీ తీవ్రంగా పెరిగింది. ఒక దర్శకుడు వరుస విజయాలను కొనసాగించాలంటే తక్కువ వ్యవధిలోనే కొత్త ప్రాజెక్ట్‌లను ప్రకటించడం కూడా కీలకంగా మారింది. ఈ విషయాన్ని బుచ్చిబాబు కూడా గుర్తించినట్లు కనిపిస్తోంది. అందుకే ఈసారి కథా రచన, ప్రీ-ప్రొడక్షన్ పక్రియలను వేగంగా పూర్తి చేసి తదుపరి సినిమాను త్వరగా పట్టాలెక్కించాలని ఆయన భావిస్తున్నారని సమాచారం.

# వరుస సినిమాల తో ప్రభాస్ బిజీ



ఇండియన్ సినిమా బిగ్గెస్ట్ సూపర్ స్టార్‌గా గుర్తింపు పొందిన ప్రభాస్ ప్రస్తుతం వరుస పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాడు. 'బాహుబలి' తర్వాత ఆయన క్రేజ్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించగా, ప్రతి సినిమా మీద అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. అయితే ఈ ఏడాది విడుదలైన 'రాజా సాబ్' సినిమా మాత్రం అభిమానులు ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. ఇదిలా ఉంటే, దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. మొదట ఈ చిత్రాన్ని 2026 చివర్లో విడుదల చేయాలని భావించినప్పటికీ, ప్రస్తుతం ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం 'ఫౌజీ' 2027లో విడుదలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. అయితే ఇదే ఇప్పుడు ప్రభాస్ అభిమానులకు మరింత ఆనందాన్ని కలిగిస్తోంది. ఎందుకంటే 2027లో ప్రభాస్ నుంచి ఏకంగా మూడు భారీ ప్రాజెక్టులు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందులో మొదటిగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న 'స్పిరిట్' ఉంది. ఈ చిత్రంలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడనే ప్రచారం ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. మరోవైపు 'బాహుబలి' ప్రపంచాన్ని మరోసారి తెరపైకి తీసుకొచ్చే యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' కూడా 2027లో విడుదల కానున్నట్లు తెలుస్తోంది. 'బాహుబలి' ఫ్రాంచైజీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ ప్రాజెక్ట్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. అదే సమయంలో 'ఫౌజీ' కూడా అదే ఏడాదిలో విడుదలైతే, ప్రభాస్ అభిమానులకు ఒకే ఏడాదిలో మూడు భారీ ట్రీట్స్ ,ఒచినట్లవుతుంది. దీంతో 2027ను ఇప్పటికే అభిమానులు 'ప్రభాస్ నామ సంవత్సరం'గా అభివర్ణిస్తున్నారు. భిన్నమైన కథలు, భారీ స్థాయి నిర్మాణ విలువలు, పాన్ ఇండియా మార్కెట్‌లో ప్రభాస్‌కు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తాయనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# హీరోయిన్లను గౌరవంగా చూపించడంలో లోటు ఉంది



మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా గడుపుతోంది. ఇటీవల 'ఓ రోమియో', 'ఓదెల-2' వంటి చిత్రాలతో అలరించిన తమన్నా... స్పెషల్ సాంగ్స్‌లోనూ మాస్ స్టెప్పులతో ప్రేక్షకులను అలరిస్తోంది. ప్రస్తుతం బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి 'వాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' అనే క్రేజీ యాక్షన్ అడ్వెంచర్ మూవీలో నటిస్తోంది. దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వంలో, బాలాజీ టెలిఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సునీల్ గ్రోవర్, శ్వేతా తివారీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను ఆగస్టు 26న గ్రాండ్‌గా థియేటర్లలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే, తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తమన్నా సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీపై చేసిన కొన్ని బోల్డ్ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట ట్రెండ్ అవుతున్నాయి. కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్లను కేవలం గ్లామర్ బొమ్మలుగా చూసే విధానం తనకు అస్సలు నచ్చలేదని తమన్నా చాలా ఓపెన్‌గా చెప్పింది. సౌత్ ఇండస్ట్రీలో పురుషాధిక్యత ఎక్కువగా కనిపిస్తుంటుందని, హీరోయిన్లను స్క్రీన్‌పై గౌరవప్రదంగా చూపించే విషయంలో అక్కడ కొంత లోటు కనిపిస్తోందంటూ తన మనసులోని అసంతృప్తిని బయటపెట్టింది. భారతీయ సినిమాల్లో కమర్షియల్ ఎలిమెంట్స్ అయిన పాటలు, డ్యాన్సులకు చాలా ప్రాధాన్యత ఉంటుందని... ఈ విషయాన్ని తాను కెరీర్ ప్రారంభంలోనే గ్రహించానని తమన్నా తెలిపింది. బాలీవుడ్‌లో కేవలం యాక్టింగ్ మాత్రమే చేసే హీరోయిన్లు కొందరైతే, గ్లామర్ పాత్రలకే పరిమితమయ్యే వాళ్లు మరికొందరు ఉంటారని విశ్లేషించింది. కానీ, కేవలం ఒకే యాంగిల్‌కు పరిమితం కాకుండా... అటు గ్లామర్ చూపిస్తూనే, ఇటు నటనకు స్కోప్ ఉన్న పాత్రలు చేయగలిగిన వారే ఇండస్ట్రీలో సూపర్ స్టార్లుగా ఎదుగుతారని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.




# విజయ్‌ను అన్ ఫాలో చేసిన త్రిష

కొన్ని నెలలుగా సోషల్ మీడియాలో విజయ్- త్రిష పేర్లు వైరలైన విషయం తెలిసిందే. వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారని వార్తలు వచ్చాయి. తాజాగా వీరిద్దరూ విడిపోయారని ప్రచారం జరుగుతోంది. జూన్ 22న విజయ్ పుట్టినరోజు కావడంతో సినీ, రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. విజయ్ సీఎం అయ్యాక తొలి పుట్టినరోజు కావడంతో త్రిష విషెస్ కోసం అందరూ ఎదురుచూశారు. ప్రతి సంవత్సరం ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపే త్రిష మాత్రం ఈసారి ఎలాంటి పోస్ట్ పెట్టకపోవడంతో నెట్టింట కొత్త చర్చ ప్రారంభమైంది. కొన్నేళ్లుగా విజయ్ పుట్టినరోజున ఆయనతో కలిసి దిగిన అరుదైన ఫొటోలను త్రిష పంచుకునే వారు. కానీ, ఈసారి ఆమె మౌనంగా ఉండడంతో పాటు.. ఇన్‌స్టాగ్రామ్‌లో విజయ్‌ను అన్‌ఫాలో చేశారు. దీంతో ఈ అంశంపై నెట్టింట చర్చ జరుగుతోంది.

# వారసత్వం ఉన్నా...కష్టపడితేనే ఫలితం

## ప్రేక్షకులు ఊరికే ఆదరిస్తానుకోరాదు -నటుడు రామ్ చరణ్



సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ.. ప్రేక్షకులు ఎప్పుడూ నటుడి నటను చూసే ఆదరిస్తారని రామ్ చరణ్ అన్నారు. తాజాగా ఆయన 'రిపబ్లిక్ సమ్మిట్'లో పాల్గొని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బిజినెస్ భాషలో చెప్పాలంటే.. 'పెద్ది' సినిమా తన కెరీర్‌కు బెస్ట్ 'స్టార్టప్' లాంటిదని వెల్లడించారు. నా చిన్నప్పుడు దర్శకులు, నిర్మాతలు 'మీ నాన్న కంటే బాగా చేయాలి' అని చెప్పినప్పుడు బాధ్యతగా అనిపించేది. నేను ఆ ఒత్తిడిని పెద్దగా పట్టించుకోలేదు. మా నాన్న ఇంట్లో సరదాగా ఉంటారు. మా డైనింగ్ టేబుల్ మీద సినిమా చర్చలు, స్టార్డమ్ ముచ్చట్లు ఎప్పుడూ రానిచ్చేవారు కాదు. సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రావడం వల్ల త్వరగా ఒక మంచి వేదిక దొరుకుతుందనేది నిజమే.. కానీ, ప్రేక్షకులు మనల్ని ఎవరి వారసుడు అని చూడరు.. మొదటి సినిమా తర్వాత కేవలం మన కష్టం, నిజాయతీ మాత్రమే చూస్తారు. నా 15 ఏళ్ల కెరీర్‌లో ఆయన నాకు ఎప్పుడూ నటన పరంగా ఫీడ్‌బ్యాక్ ఇవ్వలేదు. నన్ను వేలు పట్టి నడిపించలేదు. కానీ క్రమశిక్షణ విషయంలో ఆయనే నాకు స్ఫూర్తి అని చెప్పారు.ఓటీటీల ట్రెండ్ గురించి మాట్లాడుతూ.. థియేటర్లు, ఓటీటీలు రెండూ ఒకదానికొకటి సాయం చేసుకుంటూ ముందుకు సాగాలి. 'ఆర్ఆర్ఆర్' థియేటర్లలో విడుదలైన తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి వచ్చింది. దానివల్ల పాశ్చాత్య దేశాల ప్రజలకు కూడా సినిమా చేరి, ఆస్కార్ నామినేషన్ వరకు వెళ్లేలా క్రేజ్ పెరిగింది. భారతదేశంలో ఇప్పటికీ ఒక కుటుంబానికి అత్యంత తక్కువ ఖర్చుతో దొరికే వినోదం సినిమానే. థియేటర్లలో పాప్‌కార్న్ ధరలు కాస్త తగ్గితే ఇంకా బాగుంటుంది. సినిమా అనేది ఓ భావోద్వేగం.. అది ఎప్పటికీ అలానే ఉంటుంది. దేశభక్తి కథలకు ఎప్పుడూ ప్రాధాన్యతనివ్వాలి. ఒక సినిమా రూ.500 కోట్లు లేదా రూ.800 కోట్లు వసూలు చేస్తోందంటే, దానర్థం దేశంలోని ప్రజలు ఆ కథను తమ సొంత కథగా భావించి ఆదరిస్తున్నారనే. దేశాన్ని ఏకం చేసే ఇలాంటి సినిమాలు రావడం గొప్ప విషయం' అని రామ్ చరణ్ తెలిపారు.